



చిన్నారికి పోలియో చుక్కలమందు వేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

పోలియో రహిత సమాజమే లక్ష్యం

- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్
- 99.09 శాతం పల్స్ పోలియో నమోదు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 3 : పోలియో లేని సమాజమే లక్ష్యంగా ఏడేళ్లుగా నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కారణంగా దేశంలో కొన్నేళ్లుగా పోలియో కేసులు నమోదు కాకపోవడం హర్షణీయమని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. పల్స్‌పోలియో చుక్కలమందు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం ఏలూరులోని తాపీమేస్త్రీ కాలనీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో లాంఛనప్రాయంగా ఆయన ప్రారంభించారు. పోలియో సమూల నిర్మూలనలో భాగంగా చేపట్టిన ఈ వ్యాక్సినేషన్ కొనసాగింపునకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.91 లక్షల మంది ఐదేళ్ల లోపు పిల్లలకోసం 2.30 లక్షల డోసులను వినియోగిస్తున్నట్టు వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట మాట్లాడుతూ ఆదివారం వ్యాక్సిన్‌ను వేయించుకోనివారిని గుర్తించి ఇంటివద్ద వేసేందుకు సోమ, మంగళవారాల్లో అంగన్‌వాడీ, ఆశా, ఐకేపీ, డ్వాక్రా, వైద్యసిబ్బందితో కూడిన బృందాలు సర్వే చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో ఖాజావలి, మునిసిపల్ కమిషనర్ వెంకటకృష్ణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్‌సతీష్, మునిసిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ మాలతి తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా 99.09 శాతం పల్స్ పోలియో నమోదైనట్టు వైద్యశాఖాధికారులు తెలిపారు. సోమ, మంగళవారాల్లో డోర్ టు డోర్ సర్వే చేపట్టి వ్యాక్సినేషన్ జరిగింది లేనిది నిర్ధారించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు మహిళా ఉద్యోగులకు పోటీలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 3 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీజేఏసీ-అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9గంటల నుంచి ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో మహిళా ఉద్యోగులందరికీ ఆటలు, పాటల పోటీలను నిర్వహిస్తున్నట్టు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కేరమ్స్, చెస్, లెమన్ అండ్ స్పూన్, సింగింగ్, డాన్స్, మ్యూజికల్ చైర్స్, వక్తృత్వం విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి బహుమతులు అందజేస్తారు. ఉమ్మడి జిల్లాలోని మహిళా ఉద్యోగులందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. వివరాలకు జేఏసీ జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ ఆర్.వి.బి.టి.సుందరి ఫోన్ నెంబరు 94914 93817, కో-చైర్‌పర్సన్ యు.యామిని 96669 57819, సెక్రటరీ జనరల్ బి.గీతిక 97053 37429, అసోసియేట్ చైర్‌పర్సన్ శాంతకుమారి 94946 82151, రాష్ట్ర కార్యదర్శి జి.జ్యోతి 62810 58170లను సంప్రదించాలి. సంఘ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఈ నెల 6న ఉదయం 10గంటలకు రెవెన్యూ భవన్‌లో నిర్వహిస్తారు.

15 వరకు న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, మార్చి 3 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఈనెల 4వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 2వ తేదీన గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయవాదుల మహాసభ నిర్వహించారు. అక్కడ తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఏలూరు బార్ అసోసియేషన్ ఏకీభవిస్తూ తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో ఏపీ ల్యాండ్‌టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని, చేసే వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తామని 16వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌కు న్యాయవాదులందరూ సహకరిస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు ఏలూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ఎంఎం నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్‌లో.. కదనోత్సాహం



వచ్చే ఎన్నికల్లో జనంలోకి చొచ్చుకుపోవడమే కాకుండా తమ ఉనికిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు సిద్ధమయ్యాయి. పీసీసీ చీఫ్‌గా షర్మిల నియామకం తర్వాత కాంగ్రెస్‌కు కాస్త ఊపిరి వచ్చింది. నియోజక వర్గాల వారీగా పోటీ చేసేందుకు కొందరు ముందుకు వస్తు న్నారు. క్షేత్ర స్థాయిలో తమ ఉనికిని కాపాడు కునేందుకు వామపక్ష పార్టీలు కాంగ్రెస్‌తో జతకట్టి పోటీ చేసేందుకు సిద్ధమ వుతున్నాయి. తమకు ఆశాజనకమైన, కేడర్ ఉన్నచోట పోటీకి వీలుగా ఆయా స్థానాల్లో పొత్తు ప్రతిపాదిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే సీట్ల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకోబోతున్నారు.

- ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఆశావహుల దరఖాస్తుల పరిశీలన

- ఎంపీ సీట్లకు పోటీకి రెడీ
- కాంగ్రెస్‌తో జతకడుతున్న వామపక్షాలు
- కొన్ని అసెంబ్లీ స్థానాలకు ప్రతిపాదన
- ఈ వారంలోనే కొలిక్కి వచ్చే అవకాశం

కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కొంతలో కొంతైనా ప్రజల మధ్య నానేలా పార్టీ బలపడాలని కాంగ్రెస్ భావిస్తోంది. దీనికి తగ్గట్టుగా షర్మిల నాయకత్వంలో సీనియర్లు రంగంలోకి దిగారు. ఇంతకుముందు మాదిరిగా కాకుండా ఈసారి పోటీ చేయదలచిన అభ్యర్థులపైన దృష్టి పెట్టారు. సామాజికవర్గాల వారీగా కాస్తంత స్థితిగతులు పరిశీలించడమే కాకుండా ఇతర పార్టీల నుంచి బయటపడి టిక్కెట్ కోరుకుంటున్నవారి వివరాలపైన క్షుణ్ణంగా పరిశీలనకు దిగారు. గడచిన కొన్నాళ్లుగా వివిధ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించగా తాజాగా సీనియర్ల సమక్షంలోనే పరిశీలిస్తున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 50 మందికి పైగా టిక్కెట్ ఆశించి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన చింతలపూడి నుంచి పీసీసీకి దరఖాస్తులు అందాయి. ఏలూరు లోక్‌సభ స్థానానికి ఆరుగురు పోటీ పడుతున్నారు. అదే నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో నలుగురు, మిగతా అసెంబ్లీ స్థానాల నుంచి మరో 20 మంది దరఖాస్తు చేశారు. వాస్తవానికి గడచిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అంతంత మాత్రంగానే ఓట్లు లభించాయి. కానీ ఈసారి పీసీసీ చీఫ్ షర్మిల రాకతో ఓట్లు పుంజుకుంటాయని ఆశావహులు అంచనాలో వున్నారు. ఈ క్రమంలోనే ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలకు పోటీ చేసేందుకు సంతృప్తికర స్థాయిలో దరఖాస్తులు చేయడం కాంగ్రెస్‌లో కొత్త పరిణామం. కాంగ్రెస్‌లో దీర్ఘకాలికంగా ఉన్నవారితోపాటు ఈ మధ్యనే పార్టీలో చేరినవారు దరఖాస్తు చేసుకున్నవారిలో వున్నారు. ఏలూరు పరిధిలోనే కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు కొందరు ఆసక్తిగా ఉండడం కాకుండా సామాజిక వర్గంగా బలమైన వ్యక్తులు కావడంతో ఎన్నికలలో వీరిని రంగంలోకి దింపే అవకాశాలున్నాయి. ఏలూరు లోక్‌సభ పరిధిలో సీనియర్ నేత జెట్టి గురునాథరావు, ఆయన సన్నిహితులు ఈ మధ్యనే పార్టీకి రాజీనామా చేశారు. వాస్తవానికి పార్టీ వ్యూహ రచనలోనూ, ముందుండి నడిపించడంలోనూ కీలకమైన గురునాథరావు పార్టీని వీడడం పెద్ద దెబ్బగానే భావిస్తున్నారు. ఆయనతో సంప్రదింపులు జరిపేందుకు సరైన నేతలను రాయబారులుగా పంపలేకపోయారు. అయినప్పటికీ ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలోని 10 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ తన అభ్యర్థులను రంగంలోకి దింపాలని ఇప్పటికే నిర్ణయించింది. వీలైనంత మేర కాస్తంత ఆర్థిక పరిపుష్టి వున్నవారినే కాకుండా వైసీపీ పక్షంలో అసంతృప్తికి గురై ఆ పార్టీకి దూరంగా వుంటున్న, ఓటర్లను ఆకర్షించగలి గిన వారిని రంగంలోకి దింపాలని యోచిస్తున్నారు. దెందులూరులో డీవీఆర్ చౌదరి పోటీకి సిద్ధపడాలని భావిస్తుండగా , ఇదే నియోజకవర్గం నుంచి ఆలపాటి నరసింహమూర్తి అభ్యర్థిత్వం పరిశీలనలోకి తీసుకున్నారు. బలమైన సామాజిక వర్గాలకు చెందిన వీరిద్దరిలో ఎవరిని రంగంలోకి దించినా సంతృప్తికర స్థాయిలో ఓట్లు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌కు ఏలూరు నుంచి, పశ్చిమ గోదావరి జిల్లాలో పార్టీ అధ్యక్షుడు మారినీడి బాబ్జీకి తాడేపల్లిగూడెం నుంచి అవకాశం కల్పించబోతున్నారు. నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలో ఆశావహుల సంఖ్య తక్కువగానే ఉండడంతో ఆచి తూచి వ్యవహరించబోతున్నారు. ఎటుతిరిగి వామపక్షాలతో పార్టీ పొత్తుకు దిగబోతున్నందున ఆ దిశగా దృష్టి పెట్టారు.

వామపక్షాలు ఏం కోరుకుంటున్నాయి ?

కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా ఏ ఏ సీట్లను కోరుకోవాలో ఇప్పటి నుంచే వామపక్షాలు మదింపు చేస్తున్నాయి. సీపీఎం సాధ్యమైనంత మేర నిలదొక్కుకోవాలని తాపత్రయపడుతోంది. గడచిన ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థి బి.బలరాంకు సంతృప్తకర స్థాయిలో ఓట్లు దక్కాయి. ఈసారీ అదే నియోజకవర్గాన్ని సీపీఎం పొత్తులో భాగంగా కోరుకునే అవకాశం ఉంది. జిల్లాల విభజన తర్వాత క్షేత్రస్థాయిలో పోరాటాలకు సీపీఎం ముందు వరుసలో వుంటూ రావడమేకాకుండా అనుబంధ సంఘాల బలం కూడా కలిసొచ్చినట్లయింది. ఈ మధ్యకాలంలో అంగన్‌వాడీ, ఆశా , ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలో సీపీఎం అండగా నిలిచింది. దీంతోపాటే సీపీఐ తనవంతుగా ఎక్కడ అన్యాయం జరిగిందో అక్కడే వాలి ప్రజా పోరాటాలకు ఊతమిచ్చింది. వామపక్షాలు తాజాగా ఉండిని కోరుకుంటున్నాయి. పోలవరం స్థానంలోనూ ఇదే తరహా పోటీ కనిపిస్తోంది. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఒకవైపు సీపీఐ, వామపక్షాల అనుబంధ సంఘాలు ఈ నియోజకవర్గంలో కాస్తంత బలీయంగానే వున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ నియోజకవర్గం తమకు కేటాయించాలని కాంగ్రెస్‌ను కోరబోతున్నారు. ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి కృష్ణచైతన్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ దీనిపై దృష్టిపెట్టారు. పోలవరంతో పాటు ఒకటి రెండు స్థానాలను అటు సీపీఐ, ఇటు సీపీఎం కోరే అవకాశాలు స్పష్టంగా వున్నాయి. ఈ వారంలోపే దీనిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. సీపీఎం పక్షాన పార్టీ కార్యదర్శి ఎ.రవి, బలరాంలు తాజా పరిస్థితిపై అధ్యయనం చేస్తున్నారు.



స్థలం చుట్టూ పరదాలు కట్టిన దృశ్యం

మా స్థలాలు మాకు ఇప్పించండి!

- మెరక స్థలంపై అధికార పార్టీ నాయకుడి కన్ను
- ఇతరులకు అమ్మే యత్నం..చుట్టూ పరదాలు
- కొత్తూరు ఇందిరమ్మ కాలనీ లబ్ధిదారుల ఆవేదన

ఏలూరు రూరల్, మార్చి 3 : ఇంటి స్థలాలు ఇవ్వడంతో ఎంతో సంతోషించామని, తమలో కొందరు ఇళ్లు కట్టుకున్నారని, అయితే అధికారులు తిరిగి ఆ స్థలాలను స్వాధీనం చేసుకుని నేటికీ తమకు ఇళ్ల స్థలాలు కేటాయించకపోగా ఆ స్థలాన్ని ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మరొకరికి అమ్మే ప్రయత్నం చేస్తున్నాడని తమకు న్యాయం చేయాలంటూ బాధితులు వాపోతున్నారు. వారు తెలిపిన వివరాలివి..

స్థానిక 16వ డివిజన్‌లో కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో 2007,2009, 2012లో ఆర్.ఎస్.నెంబర్ 201, 204 లేఅవుట్‌ల్లో సుమారు 200 మందికి పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. వీరిలో కొత్తూరు-2లో ప్లాట్ నెంబర్ 464 నుంచి 473 వరకు కొందరు లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. వీరిలో సొంతంగా ముగ్గురు ఇళ్లు కట్టుకున్నారు. ఇంటిపన్నులు సైతం కడుతున్నారు. అయితే 2009లో సరైన కారణం చూపకుండా ఈ పది మంది లబ్ధిదారులకు వేరేచోట ఇంటి స్థలం ఇస్తామని చెప్పి అధికారులు ఖాళీ చేయించారు. అప్పటి నుంచి వీరికి ఎక్కడా స్థలం కేటాయించలేదు. అధికారులు చుట్టూ లబ్ధిదారులు తిరిగినా ఫలితం లేదు. అయితే ఆ స్థలం మెరక ప్రాంతం కావడంతో వైసీపీకి చెందిన స్థానిక ఓ నాయకుడి కన్నుపడిందని, తాము ఖాళీ చేసిన స్థలంలో 600 గజాలను అతను ఇతరులకు అమ్మే ప్రయత్నం చేస్తున్నట్టు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఆ స్థలం కనిపించకుండా చుట్టూ పరదాలు కట్టించాడని మండిపడుతున్నారు. దీనిపై అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని, జగనన్న చెప్పుకుందాం స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని లబ్ధిదారులు టి.విజయలక్ష్మి, డి.పుష్ప, పిట్ల సూర్యకుమారి, నజీమా, మాజేటి భవాని, పంతం మరియమ్మ, వై.రణధీర్‌గౌడ్ తదితరులు కోరుతున్నారు.

ఓట్లు ఎలా అడుగుతాం..?

నేను కార్పొరేటర్‌గా ఉండగా కొత్తూరులోని ఇందిరమ్మకాలనీలో ఇళ్ల స్థలాలు ఇప్పించాను. మెరక స్థలమని కొంతమందికి స్థలం ఇచ్చినట్లే ఇచ్చి ఆ స్థలాన్ని తిరిగి తీసేసుకున్నారు. అప్పటికే కొందరు ఇళ్లు కట్టుకున్నారు. పన్నులు చెల్లించారు. వారికి కూడా నేటికీ ఇంటిస్థలం ఇవ్వలేదు. మా పార్టీకే చెందిన ఓ వ్యక్తి ఆ స్థలాన్ని మరొకరికి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. లబ్ధిదారులతో ఇటీవల కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే ఆళ్ళ నానిని కలిసి ఫిర్యాదు చేశాం. దీనిపై విచారణకు ఆదేశించినా అధికారులు స్పందించడం లేదు. వైసీపీలోనే ఉంటూ కొందరు చేసే పనుల వల్ల తలెత్తుకోలేకపోతున్నాం. తిరిగి ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు ఎలా అడుగుతాం. ఇప్పటికైనా అధికారులు లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

- ఎరకల సాంబశివరావు, మునిసిపల్ మాజీ కార్పొరేటర్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

వరి వద్దు.. ఆక్వా ముద్దు!



కలిదిండిలో చెరువుగా మారిన మాగాణి

- కైకలూరు నియోజక వర్గంలో తగ్గిన వరిసాగు విస్తీర్ణం

చేపలు, రొయ్యల చెరువులుగా మాగాణి భూములు

కలిదిండి, మార్చి 3 : ఆక్వా సాగులో నికర ఆదాయం రావడంతో కైకలూరు నియోజకవర్గంలో మాగాణి భూములన్ని చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోతున్నాయి. క్రమేణ వరిసాగు కనుమరుగవుతోంది. ఒకప్పుడు ధాన్యాగారాలకు నిలయంగా ఉన్న కలిదిండి, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో నేడు ఆక్వా సాగు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుండడంతో రైతులు తమ పంట పొలాలను చెరువులుగా తవ్వేశారు. సాగునీరు అందుబాటులో లేక ఎకరాకు లీజు లక్ష రూపాయల వరకు రావడంతో రైతులు తమ మాగాణి భూములను చేపలు, రొయ్యల చెరువులకు బడాబాబులకు ఇచ్చేశారు. కైకలూరు నియోజకవర్గంలో సుమారు లక్షా యాభై ఆరు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కలిదిండి మండలంలో 38 వేల ఎకరాల ఆయకట్టుకు గానూ 35 వేల ఎకరాల్లో ఆక్వా సాగు, రెండు వేల ఎకరాల్లో వరి సాగు, కైకలూరు మండలంలో 40 వేల ఎకరాలను గానూ 37 వేల ఎకరాల్లో ఆక్వా సాగు, మూడు వేల ఎకరాల్లో వరి సాగు, మండవల్లి మండలంలో 39 వేల ఎకరాలకు గానూ 35 వేల ఎకరాల్లో ఆక్వా సాగు 4 వేల ఎకరాల్లో వరి సాగు, ముదినేపల్లి మండలంలో 38 వేల ఎకరాలకు గానూ 22 వేల ఎకరాల్లో ఆక్వా సాగు, 16 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వీటిల్లో అధికంగా గరువు ఛానల్ పరిధిలో మాత్రమే సార్వాకు వరి, దాళ్వాకు అపరాలు సాగు చేస్తున్నారు. జిల్లాకు శివారు ప్రాంతం కావడంతో సాగునీరు అందక మాగాణి భూములు చేపల, రొయ్యల చెరువులుగా మారిపోయాయి. 2006లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి కొల్లేరులో అక్రమ చేపల చెరువులను బాంబులతో ధ్వంసం చేయడంతో ఆ ప్రాంతంలో ఆక్వా సాగు చేసే బడాబాబులు కలిదిండి మండలంలో బీడు వారిన రొయ్యల చెరువులను తక్కువ లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చేశారు. అనంతరం అధిక లాభసాటిగా ఉండడంతో వేలాది పంట పొలాలను చేపలు, రొయ్యల చెరువులుగా తవ్వేశారు. సాగునీరు కొరత, వరి పంట చేతికి వచ్చే సమయానికి తుపాన్లతో పంట నీట మునిగిపోవడంతో నష్టాలు వచ్చి అప్పుల పాలవడంతో వరి సాగుపై విరక్తి చెంది మాగాణి భూములను చేపల, రొయ్యల చెరువులుగా తవ్వేయడంతో నియోజకవర్గంలో వరి సాగు కనుమరుగవుతోంది.

సాగునీటి కొరతతో చెరువులుగా ..



జిల్లాకు శివారు ప్రాంతం కావడంతో సాగు నీరు అందక వరి పంట దెబ్బతిని నష్టాలు వస్తున్నాయి. ఉప్పుటేరులో నీరు అందుబాటులో ఉండడంతో ఆక్వా సాగు చేస్తున్నాం.

- ఎం.సుబ్బరాజు, ఆక్వా రైతు

ధాన్యానికి గిట్టుబాటు ధర లేక..



ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడం లేదు. పెట్టుబడి వ్యయం పెరిగింది. దీంతో పంట పొలాలను చేపల, రొయ్యల చెరువులుగా తవ్వేశాం. వీటిపై నికర ఆదాయం వస్తోంది.

- ఎన్.భగవాన్లు

కాయ్ రాజా కాయ్..!



- నరసాపురం సీటుపై రూ.10 కోట్లు దాటిన పందేలు
- మధ్య వర్తిగా క్రికెట్ బుకీ

నరసాపురం, మార్చి 3 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఎన్నికల పందేలు హద్దు మీరుతున్నాయి. ఇంకా నోటిఫికేషన్ వెలవడలేదు..టిక్కెట్ల కేటాయింపు కొలిక్కి రాలేదు. అయితే పందేలు మాత్రం జోరందుకున్నాయి. అది కూడా గెలుపుపై కాదు..సీటు ఎవరికి ఇస్తారా అనేదానిపై కాయ్ రాజా కాయ్ అంటూ కాలు దువ్వుతున్నారు. పొత్తులో భాగంగా తమ నాయకుడికే టిక్కెట్ దక్కుతుందని ఒక పార్టీకి చెందిన క్యాడర్ పందేలకు దిగారు. మొదట్లో సమానంగా సాగిన పందేలు నేడు కోసు పందాలకు దారి తీశాయి. టిక్కెట్‌పై ధీమా ఉన్న ఒక నాయకుడి క్యాడర్ ఒకటికి ఐదు రెట్లు ఆఫర్ చేస్తుండటంతో రెండు రోజుల నుంచి ఈ పందేలు కోట్లలోకి చేరాయి. చాలా మంది అప్పులు తెచ్చి మరీ కాస్తున్నారు. లక్ష రూపాయలు కాస్తే ఐదు లక్షలు వస్తుందన్న ధీమాతో చాలా మంది వస్తువుల్ని సైతం తాకట్టు పెట్టి పందేల బరిలో దిగుతున్నారు. ఇటు పోటీలో ఉన్న ఇద్దరు నాయకులు కూడా టిక్కెట్‌పై ధీమాతో వ్యక్తం చేస్తుండటంతో క్యాడర్‌లో ఉత్సాహం మరింత పెరిగింది. ఇప్పటి వరకు వీరిద్దరిపై సుమారు రూ.10 కోట్లపైనా పందేలు జరిగిన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇద్దరు ఒకే పార్టీకి చెందిన నాయకులు కావడంతో టిక్కెట్ కేటాయింపులో ఏ మాత్రం తేడా జరిగినా కోసు పందెం కాసిన వారంతా భారీగా నష్టపోతారన్న చర్చ తీర ప్రాంతంలో నెలకొంది.

మధ్యవర్తిగా రంగంలోకి క్రికెట్ బుకీ

ఇక ఈ పందేలకు మధ్యవర్తిగా ఓ క్రికెట్ బుకీ వ్యవహరిస్తున్నారు. రెండు వైపులా పందేలను ఇతగాడే చూపిస్తున్నారు. ఇందుకు గాను పెద్ద మొత్తంగా కమీషన్ డిమాండ్ చేస్తున్నారు. మొదట్లో కోసు పందేలు లేవు. లక్షలోనే ఉండేవి. పార్టీలోని ఓ సీనియర్ నాయకుడి వద్ద ఇరువురు పందెం మొత్తం కలిపేవారు. ఎప్పుడైతే క్రికెట్ బుకీ ఎంటర్ ఆయ్యాడో కోసు పందేలకు తెరలేచింది. మొదట్లో ఒకటికి రెండు రెట్లు ఉన్న పందెం నేడు ఐదు రెట్లు వరకు వెళ్లింది..గతంలో ఈ బుకీ జిల్లాలో బెట్టింగ్ నిర్వహించేవాడు. అయితే పోలీసులు నిఘా పెట్టడంతో ఇతగాడు మకాం మార్చాడు. హైద్రాబాద్, బెంగళూర్‌లలో ఉంటూ అక్కడ నుంచి ఫోన్ల ద్వారా దందా నడిపిస్తున్నాడు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ఈ బుకీ రూటు మార్చాడు. క్రికెట్‌లో బెట్టింగ్‌లు కాసే వారితో సంప్రదించి రెండు వైపులా పందేలను సెట్ చేస్తున్నాడు. దీంతో రోజు రోజుకు పందేలు హద్దులు దాటుతున్నాయి.

అనుమతులు చూపితేనే.. వదులుతాం

పెనుగొండ, మార్చి3: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం నడిపూడి ఇసుక ర్యాంప్‌లో మూడు రోజులుగా రాత్రి, పగలు ఇసుక తవ్వకాలు జరుపుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. పర్యావరణ అనుమతులు లేవని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. కాని ర్యాంప్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఇసుక ఎగుమతులు జరుపుతుండగా గ్రామస్థులు లారీలను అడ్డుకున్నారు. ర్యాంప్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి గ్రామస్థులతో మాట్లాడారు. అనుమతి పత్రాలు చూపిస్తేనే లారీలను వదులుతామన్నారు. అనుమతి పత్రాలు చూపించి తేలుకోవాలని ర్యాంప్ నిర్వాహకులకు పోలీసులు సూచించారు. అనుమతి పత్రాలు చూపిస్తామంటూ సాయంత్రం వరకు చెబుతూ వచ్చారే కానీ చూపించలేక పోయారు. ఇటీవల గత కలెక్టర్ పి.ప్రశాంతి సైతం ఇసుక ర్యాంప్‌ను సందర్శించారు. ర్యాంప్‌నకు అనుమతులు లేవని ఎవరైనా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయి నప్పటికి ర్యాంప్‌లో ఇసుక అక్రమార్కులు దందా కొనసాగిస్తున్నారు.



ఇసుక లారీలకు అడ్డంగా బైక్‌లు అడ్డుపెట్టిన దృశ్యం



ఘాటెక్కిన అల్లం

- కేజీ ధర రూ.160 నుంచి రూ.180

ముదినేపల్లి, మార్చి 3 : మార్కెట్‌లో అల్లం ధర బాగా పెరిగింది. ముదినేపల్లి ప్రాంతంలో రిటైల్ మార్కెట్‌లో అల్లం కేజీ ధర రూ.160 నుంచి 180 వరకు పలుకుతోంది. వారం రోజుల క్రితం అల్లం కేజీ ధర రూ.120 నుంచి రూ.130 వరకు ఉండగా, ఇప్పుడు ఈ ధర మరో రూ.30 నుంచి రూ.50కి పెరిగింది. అల్లం వినియోగం పెరగడం, రాయలసీమ జిల్లాల నుంచి అల్లం దిగుమతులు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. దీనికి తోడు హోల్ సేల్ డీలర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్టు చెబుతున్నారు. వేసవిలో అల్లం పచ్చళ్ల పట్టడం, వివాహాలు తదితర కార్యక్రమాలు పెద్ద సంఖ్యలో జరుగుతుండడం వల్ల అల్లం వినియోగం భారీగా పెరగడంతో గిరాకీకి తగ్గట్టు ధరలను వ్యాపారులు పెంచేశారు.

టెట్‌కు 69 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 3 : టెట్‌లో భాగంగా ఆదివారం ఉదయం జరిగిన పరీక్షకు జిల్లాలో 327 మంది, మధ్యాహ్నం పరీక్షకు 334 మంది అభ్యర్థులు హాజరు కాగా మొత్తం 69 మంది గైర్హాజరైనట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు.

టీడీపీ, జనసేన కలయికతో రాష్ట్ర ప్రగతి : చింతమనేని


మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్

పెదవేగి, మార్చి 3: టీడీపీ-జనసేన కలయిక రాష్ట్ర ప్రగతికి చిహ్నామని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అప్పుల ఆంధ్రాగా మారుతున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తిరిగి గాడిలో పెట్టేది చంద్రబాబునాయుడు మాత్రమేనన్నారు. దుగ్గిరాలలో టీడీపీ నియోజకవర్గం సమన్వయ కమిటీ సమావేశం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సంపదను సృష్టిస్తే సంక్షేమం వస్తుంది, అప్పుతో తినే పప్పుకూడుతో రాదన్నారు. సంపద సృష్టించే మిషన్ చంద్రబాబునాయుడు అయితే, దానిని పాడు చేసే కంత్రీ జగన్ అన్నారు. జగన్ చేస్తున్న మోసాలను ప్రజలు తెలుసుకున్నారని, టీడీపీ, జనసేన కూటమిని ఆదరిస్తారని, వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. పార్టీ పరిశీలకుడు చెన్నుపాటి గాంధీ, జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, యూ.ఎస్.రామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, మోరు శ్రావణి, సైతు సత్యనారాయణ, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం : రోషన్


సమావేశంలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, మార్చి 3: వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. టీడీపీ, జనసేన సమన్వయ సమావేశం ఆదివారం నిర్వహించారు. టీడీపీ, జనసేన నేతలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటా తీసుకు వెళ్లాలని, టీడీపీ, జనసేన సమన్వయంతో పని చేసి విజయం సాధించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, కరాటం సాయి, జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్రి బాలరాజు, టీడీపీ నాయకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్, మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తఫా, పెనుమర్తి రామ్‌కుమార్, ముత్తారెడ్డి, పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, శ్రీధర్, నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు చేసే వారికి ఓటు వెయ్యవద్దు : బడేటి


సూపర్ 6 పథకాలు వివరిస్తున్న చంటి

ఏలూరు టూటౌన్, మార్చి3: హత్యా రాజకీయాలు చేసే అన్నకు ఓటు వేయవద్దని ముఖ్యమంత్రి చెల్లెలు సునీత చెబుతున్నారని, ప్రజలు ఆలోచించాలని జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం 21, 47వ డివిజన్లలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6పథకాలు వివరించారు. జగన్ అధికారంలోకి వస్తే యువత భవిష్యత్ అంధకారంలోకి పోతుందన్నారు. ప్రజల ఆశలకు రక్షణ కూడా ఉండదన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం దిగజారిపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో జనసేన, టీడీపీ కూటములు అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏ.రామకృష్ణ, భాస్కరరావు, శ్రీనివాస్, బాబురావు, శ్రీనివాస్, జుంజు మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

మన ఇంటికి మన గన్ని ప్రచార కార్యక్రమం


వడ్లపట్లలో ప్రచారం నిర్వహిస్తున్న గన్ని

భీమడోలు, మార్చి 3: అంబర్‌పేటలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మన ఇంటికి మన గన్ని పేరుతో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల ముఖ్య నాయకులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించాలి


పథకాలను వివరిస్తున్న నరేష్

కొయ్యలగూడెం, మార్చి 3: సూపర్-6 పథకాలను ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాల్సిన బాధ్యత టీడీపీ, జనసేన నాయకులు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నరేష్ కోరారు. మండలంలోని బయ్యన్నగూడెంలో ఆదివారం సూపర్-6 పథకాలు ప్రజలకు వివరించారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు ప్రతీ ఇంటికివెళ్లి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ సంయుక్త ప్రభుత్వంలో ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించాలని కోరారు. గ్రామాల్లో కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్తిపండు, బాలు, నెరుసు రామకృష్ణ, సీతారామ్ తదితరులు ఉన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకంపై హామీ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వసంతరావు

చింతలపూడి, మార్చి 3: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని, పథకం పూర్తి చేసి మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరందిస్తామని హామీ ఇవ్వాలని సీపీఐ సీనియర్ నాయకులు ఎం.వసంతరావు డిమాండ్ చేశారు. మల్లాయిగూడెంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. మెట్ట ప్రాంత చెరువుల్లో నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఈ పథకాన్ని ప్రారంభించాలని కోరారు. ఆంధ్ర కాలువకు ఈ నీరు అందించాలని, కాలువ పరిధిలోని 21 చెరువులలో ఉపయోగపడే విధంగా పూడుకు పోయిన కాలువను మరమ్మతులు చేపట్టాలని కోరారు. భూమి కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించే విషయాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, గ్రామ టీడీపీ నాయకులు చీకటి రమేష్, టి.ప్రసాద్, ఎస్.కె.జానీ, చీకటి బాబూరావు, పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాట్య తిలకం అవార్డులు అందజేత



పురస్కారాలు అందుకున్న నాట్య కళాకారులు

ఏలూరు కల్చరల్, మార్చి 3: వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో ఇండో నేపాల్ డ్యాన్స్, మ్యూజిక్ ఛాంపియన్‌షిప్ అవార్డుల కార్యక్రమం ఆదివారం జరిగింది. హైదరాబాద్ కల్చరల్, ఫైనార్ట్స్ ఫెడరేషన్, ఏలూరు నటరాజా నాట్య కళా కేంద్రం, గుంటూరు రాధామాధవ్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ, జానపద నృత్యాల పోటీలు నిర్వహించారు. అనంతరం నాట్యతిలకం అవార్డులను ప్రదానం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి నాట్య కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అద్భుత నాట్య ప్రదర్శనతో అలరించారు. ప్రదర్శనల అనంతరం పురస్కారాలు అందించారు. స్నేహం అసోసియేషన్ అధ్యక్షుడు అంబికా రాజా ముఖ్య అతిథిగా పాల్గొని నాట్యతిలకం అవార్డులను అందజేశారు.

శ్రీ కోదండ రామాలయం,
పెరుగుగూడెం, తిరుమలదేవి పేట (గ్రా), టి.నరసాపురం (మం), ఏలూరు జిల్లా.

e-Procurement Tender
NIT No.P/COE/268/2024-123, Dt. 28.02.2024

దేవాలయ నిర్మాణము పూర్తి చేయుట కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ ను చూడగలరు.

ఇట్లు: ధర్మకర్త

దేవదాయ ధర్మదాయ శాఖ
భూములు కౌలుకు టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, నిడమర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ కేశవస్వామి వారి దేవస్థానము యొక్క రి.స.నెం288 నందు య.6-53 సెం.లు చేపల చెరువు నందు చేపలు పెంచుకొనుటకు లైసెన్స్ హక్కు కొరకు ది.13.03.2024 తేది ఉదయం గం.11.00లకు శ్రీ స్వామి వారి కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయము (B.M.R. సూపర్ మార్కెట్ బిల్డింగ్ పైన) గణపవరం నందు 13.03.2024 తేదీ నుండి ది.12.03.2027 తేదీ వరకు (అనగా 3 సం.ములు) కౌలు హక్కు పొందుటకు గాను శ్రీ తనిఖీదారు, దేవదాయశాఖ, తాడేపల్లిగూడెం వారి సమక్షమున కార్యనిర్వాహణాధికారిచే బహిరంగ వేలంపాట నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

ముఖ్యమైన పాట షరతులు :

1. ఈ వేలం జి.ఓ.నెం 426 రెవిన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంటు తేది : 09.11.2015 నందలి నిబంధనలను అనుసరించి హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ, అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి ఆలయ కార్యనిర్వాహణాధికారిచే జరుపబడుచున్నది. 2) పై జి.ఓ నిబంధనలను అనుసరించి హెచ్చుపాటదారుడు ప్రతి సం.ము యకరా 1కి మొదటి సం.ము మక్తాపై 2వ సం.మునకు 10% పెంపుదల, 3వ సం.మునకు 2వ సం.ము మక్తాపై 10% పెంపుదల చేయుచూ చెల్లించు నిర్ణయం. 3) దేవస్థానమునకు ఏ విధమైన బకాయిలు ఉన్న వారు గానీ దేవస్థానముతో ఏద్తి లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు. పాట పాడుటకు తగిన అర్హత లేని వారిని పాటలో పాల్గొనకుండా చేయుటకు కార్యనిర్వాహణాధికారి వారికి అధికారము కలదు. 4) హెచ్చు పాటదారుడు 1.సం. కౌలు శిస్తు సొమ్మును పాట పాడిన వెంటనే (ముందుగా) అడ్వాన్స్‌గా జమచేయవలెను. దీనికి వడ్డీ ఇవ్వబడదు. మిగిలిన పాట షరతులు కార్యాలయము పనివేళలలో అడిగి తెలుసుకొనవలెను. లేదా పాట జరుగు సమయంలో చదివి వినిపించబడును.

గ్రామం: నిడమర్రు
తేది : 02.02.2023

ఇట్లు :
కార్యనిర్వాహణాధికారి
9676408813


నందాపురంలో పోలియో చుక్కలు వేస్తున్న ఐటీడీఏ పీవో


పెదపాడులో పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీ చైర్మన్


లింగపాలెం శిబిరంలో వైద్యాధికారి, సిబ్బంది


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ నూర్జహాన్

పోలియో మహమ్మారిని తరిమికొట్టే

చుక్కల మందు

గ్రామాలు, పట్టణాల్లో పల్స్ పోలియో

పెదపాడు, మార్చి 3: పోలియో మహమ్మారిని తరిమికొట్టే చుక్కల మందుకు జిల్లాలో విశేష స్పందన వచ్చింది. పట్టణాలు, మండలాల్లో ఆదివారం ప్రత్యేక శిబిరాల్లో పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్లలోపు తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు పీహెచ్‌సీ వద్ద ఎంపీపీ ఐత్తుల రత్నకుమారితో కలసి చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేశారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి పోలీయో చుక్కలు ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టరు అనంతపాల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి: పోలియో మహమ్మారి అంతానికి రెండు పోలియో చుక్కలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పోలియో మహమ్మారి అంతం సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ భావించాలన్నారు. నడిపల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ మేకా అప్పాయమ్మ, విజయరాయి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెం, కె.గోకవరం, లింగపాలెం, పీహెచ్‌సీల పరిధిలో వైద్యులు కృష్ణకిషోర్, ప్రీతి, నైమిష ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. మరో రెండు రోజులు పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ధర్మాజీగూడెంలో సొంగా సందీప్ చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు: చేబ్రోలు, కాగుపాడు పీహెచ్‌సీల పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, వైద్యాధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు.

● బుట్టాయగూడెం: పోలియో రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. తెల్లంవారిగూడెంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎంపీపీ కారం శాంతి వైద్యాధికారులు, సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● ఏజెన్సీలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయినట్లు జిల్లా ఉప వైద్యాధికారి కె.మేరి కేథరిన్ తెలిపారు. నందాపురం పీహెచ్‌సీలో కేఆర్.పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజతో కలసి పోలియో చుక్కలు వేశారు. ఏజెన్సీ ఐదు మండలాల్లో సుమారు 17,100 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయవలసి ఉండగా 321 బూత్‌ల ద్వారా 16,426 మంది మంది చిన్నారులకు 96 శాతం పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మిగిలినవారికి ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

● జీలుగుమిల్లి: కామయ్యపాలెం, రాచన్నగూడెం, జీలుగుమిల్లి పీహెచ్‌సీల పరిధిలో పల్స్ పోలియో నిర్వహించారు. అంకన్నగూడెంలో జడ్పీటీసీ మల్ల వసంత్ పాల్గొన్నారు. జీలుగుమిల్లి పీహెచ్‌సీ పరిధిలో 98శాతం పూర్తి చేశారు. 1369 మంది చిన్నారులకు, రాచన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో 499 మందికి వేశారు. వైద్యులు బి.గాయత్రి, కె.దివ్య, ఎం.రాఘబిందు, సిబ్బంది శ్రీనివాసరాజు, ఎన్.మార్రాజు, కె.సోమమ్మ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: తంగెళ్ళమూడి అర్బన్ హెల్త్ సెంటర్‌లో పోలియో చుక్కల శిబిరాన్ని నగర మేయర్ షేక్ నూర్జహాన్ ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో రెండురోజుల పాటు సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాసరావు, నూకపేయి సుధీర్‌బాబు, కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఎం.హెచ్.వో మాలతి, కార్పొరేటర్లు బి.శ్రీనివాసరావు, నున్న స్వాతి, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు చోట్ల పోలియో చుక్కలు వేశారు. అధ్యక్షుడు ఎస్.రోహిత్, ఎస్.ప్రసాద్‌రావు, కె.గోపాల్‌గుప్తా, పి.దామోదర్‌రెడ్డి, జి.లలిత, నిర్మలాదేవి, నాగభూషణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, ప్రగడపల్లి జిల్లెల్లగూడెం, ఎల్ఎన్‌డీపేట పంచాయతీల పరిధిలో గ్రామాల్లో పల్స్ పోలియో నిర్వహించారు. పిల్లలకు అంగన్వాడీ, ఆశా, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కార్యకర్తలు పోలియో చుక్కలు వేసారు. 1363 మందికి గాను 1335 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వింజరం వైద్యాధికారి మురళీధర్ అయినట్లు తెలిపారు.

● కామవరపుకోట: మండలంలో 48 కేంద్రాల్లో పల్స్ పోలియో నిర్వహించారు. మొబైల్ వ్యాను ద్వారా కూడా పోలియో చుక్కలు వేశారు. మండలంలో ఐదు వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని వైద్యాధికారి తాతా కుమార్ తెలిపారు.

● టి.నరసాపురం: పీహెచ్‌సీ పరిధిలో 46 పోలియో బూత్‌లలో 3456 మంది, బొర్రంపాలెం పీహెచ్‌లో పరిధిలో 1530 మందికి పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి జె.కల్పనారాణి తెలిపారు. మిగిలిన వారికి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటా సర్వే చేసి పోలియో చుక్కలు వేస్తారని ఆమె తెలిపారు. పోలియో బూత్‌లను తహసీల్దార్ సుభాష్ పర్యవేక్షించారు.

● కుక్కునూరు: అమరవరం పీహెచ్‌సీ పరిధిలో 1746 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ అనంత్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 36 మంది సిబ్బందితో రూట్ సూపర్‌వైజర్లు పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. ఆదివాసీ గ్రామమైన బరపటినగరం, రెడ్డిగూడెంతోగు, గొట్టపుతోగు, మారుమూల గ్రామాల్లో పోలియో చుక్కలు వేశామన్నారు.

● చింతలపూడి: మండలంలో పల్స్ పోలియో 98 శాతం పూర్తయిందని పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. భట్టువారిగూడెంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ పల్స్ పోలియో చుక్కలు వేశారు. మండలంలోని 3 పీహెచ్‌సీల పరిధిలో 74 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. హెల్త్ అసిస్టెంట్‌లు సయ్యద్ జఫ్రుల్లా, బాలరాజు, మంగ తాయారు, అబ్రార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


పోలవరం బస్టాప్‌లో పోలియో శిబిరం




పోలియో చుక్కలు వేస్తున్న చింతలపూడి పీహెచ్‌సీ వైద్యుడు


జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంలో..

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, మార్చి 3: రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు సత్యనారాయణ శర్మ, శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. కొవిడ్ నిబంధనలు అనుసరించి, అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించామని, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

భారతం, రామాయణంపై క్విజ్ పోటీలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 3: అగ్రహారంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం క్విజ్ మాస్టర్ అనగాని శ్రీరామచంద్రమూర్తి హైస్కూలు విద్యార్థులకు భారతం, రామాయణంపై క్విజ్ పోటీ నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. గండికోట రాజేష్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి.

శనివారపుపేట శ్రీరామ్‌నగర్ 11వ రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సాయి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయి సంకీర్తనలు ఆలపిస్తూ పాల్గొన్నారు. సోమవారం సాయిబాబా వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, 108 రోజుల బాబా పారాయణ, గ్రంథ శ్రవణ, భక్తులకు అన్నసమారాధన జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ధన్వంతరి ఆలయంలో అన్న సమారాధన

ఏలూరు కార్పొరేషన్, మార్చి 3: పవరుపేట స్టేషన్‌రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద అన్న సమారాధన చేశారు. న్యాయవాది మంచనపల్లి శ్రీనివాస్ ఆదివారం అన్న సమారాధన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని సూర్యనమస్కార పూజలు చేశారు.

దేహదారుఢ్య పోటీల్లో పవన్‌కుమార్‌కు స్వర్ణం

ఏలూరు స్పోర్ట్స్, మార్చి 3: దేహదారుఢ్య పోటీల్లో ఏలూరు యువకుడు పవన్ కుమార్ స్వర్ణంతో చాంపియన్‌గా నిలిచాడు. ఎమ్మెల్యే ఆళ్ళ నానిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కేరళలో జరిగిన ఆలిండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఏలూరు లక్ష్మణ్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న పవన్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. తమిళనాడులో జరిగిన బాడీబిల్డింగ్ పోటీల్లోనూ ఓవరాల్‌ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌ను పలువురు బాడీబిల్డర్స్, లక్ష్మణ్ జిమ్ సెంటర్ ట్రైనీ బైరెడ్డిలక్ష్మణరావు తదితరులు అభినందించారు.

పరివర్తనలో ప్రపంచ వినికిడి దినోత్సవం

ఏలూరు రూరల్, మార్చి 3: దొండపాడు ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాసకేంద్రంలో ఆదివారం ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆడియాలజిస్ట్ ఆదిత్య మాట్లాడుతూ వినికిడి లోపం చిన్నారులు, పెద్దల్లో సంభవిస్తుందని, ఐదేళ్లలోపు పిల్లలకు కార్టిలీయర్ ఇంప్లాంటేషన్ ద్వారా వినికిడి లోపం కొంత వరకు నివారించవచ్చన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 25ఏళ్లుగా వినికిడిలోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక విద్యనందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవీఆర్‌సీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, దివ్యాంగుల చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానానికి బాట గ్రంథాలయ దర్శనం


పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, మార్చి 3: తరచు గ్రంథాలయానికి వెళ్లడం విజ్ఞానానికి బాట అని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం జరిగింది. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివారు. అరుణ్‌కుమార్ గ్రంథపఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పరిశీలించిన డీపీవో


ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న డీపీవో

ఏలూరు రూరల్, మార్చి 3: పేదలందరికి ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఆదివారం ప్రత్యేకడ్రైవ్ చేపట్టినట్లు డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సచివాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. సచివాలయం పరిధిలో 313 రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 268 పూర్తి చేసినట్లు తెలిపారు. మిగతావి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం చాటపర్రులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో క్రీడా వార్షికోత్సవం


పతకాలు సాధించిన బాలలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 3: సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ పూర్వప్రాథమిక విద్యార్థులకు ఆదివారం క్రీడా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విలువలతో కూడిన విద్యా విధానాన్ని విద్యార్థులకు అందించాలని సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి మాగంటి ప్రసాద్ టీచర్లకు సూచించారు. క్రీడల్లో నిబద్ధత, అంకితభావంతో తర్ఫీదునిచ్చిన వ్యాయామోపాధ్యాయులను కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్ అభినందించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు పతకాలు, ప్రశంసాపత్రాలను బహూకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్, డైరెక్టర్ రాజకళా శ్రీధరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి


కలపర్రు టోల్‌గేట్ వద్ద హెల్మెట్లపై అవగాహన

పెదపాడు, మార్చి 3: సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి అని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద ఎస్పీ మేరీప్రశాంతి, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య ఆదేశాలతో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ ధరించకపోవడం మృతి చెందుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం ద్వారా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్ -1 ర్యాంకర్‌కు సత్కారం

లింగపాలెం, మార్చి 3: ఇటీవల గ్రూప్ -1లో ప్రథమ ర్యాంక్ సాధించిన గోపిశెట్టి మనోహర్‌ను ఆర్యవైశ్య మహిళా ఏపీ విభాగం అధ్యక్షురాలు కొర్రిపల్లి జయశ్రీ, రాఘవ దంపతులు ఆదివారం సత్కరించారు. మనోహర్ ప్రస్తుతం విజయవాడలో రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్యుల్లో ఇంతటి ర్యాంకును సాధించిన ఆయనను భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు గుంటూరులో జయహో బీసీ సభ

ఏలూరు టూటౌన్, మార్చి3: టీడీపీ జయహో బీసీ బహిరంగ సభ మంగళగిరిలో మంగళవారం జరుగుతుందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. చంద్రబాబు నాయుడు, లోకేశ్ బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారన్నారు. బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

నడి రోడ్డుపై ఫిట్స్‌తో ఒకరి మృతి

జంగారెడ్డిగూడెం, మార్చి 3: పట్టణంలో నడిరోడ్డుపై ఫిట్స్‌తో ఒకరు మృతి చెందారు. పట్టణంలో తాపీ పని చేసుకునే లంకా మోహన్ ఆదివారం స్థానిక పేరంపేట నాలుగు రోడ్ల కూడలి చేరుకున్నాడు. రోడ్డుపై ఫిట్స్‌తో పడిపోయిన మోహన్ అక్కడికక్కడే మృతిచెందాడు.

రామ మందిర కల నెరవేరింది


భక్తులకు ప్రసాదాలు పంచుతున్న తపనా చౌదరి

ఏలూరు టూటౌన్, మార్చి 3: అయోధ్యలో రామ మందిరం నిర్మాణంతో భారతీయుల కల నెరవేరిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి అన్నారు. అయోధ్య బాలరాముని దర్శనానికి ఏలూరు నుంచి 200 మంది రామభక్తులు వెళ్లి వచ్చారన్నారు. భక్తులు అక్కడి నుంచి తీసుకొచ్చిన ప్రసాదాన్ని ఆదివారం ఆయన పంచిపెట్టారు. ఏలూరు రైల్వేస్టేషన్ లో రైతు ప్రయాణికులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. సినీ గేయ రచయిత అనంతశ్రీరామ్‌తో పాటు చౌదరి మాట్లాడుతూ రామభక్తులు అయోధ్యలోని బాల రాముని దర్శించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన ధానభాస్కరరావు, దెందులూరు, భీమడోలు ఇన్‌చార్జ్‌లు గుమ్మడి చైతన్య, బటేల్ పాల్గొన్నారు.

కైకరం నుంచి భక్తుల అయోధ్య యాత్ర

ఉంగుటూరు: మండలంలో కైకరం సీతారామ ఆలయం నుంచి అయోధ్య బాల రాముని దర్శనానికి భక్తులు తరలి వెళ్లారు. కైకరం రైల్వే స్టేషన్ నుంచి వారిని గారపాటి సీతారామాంజనేయ చౌదరి, గేయ రచయిత అనంత శ్రీరామ్ అయోధ్యకు సాగనంపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

ఏ పార్టీలోనూ చేరను : రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 3: ఇటీవల పరిణామాల నేపథ్యంలో కొన్ని రాజకీయ పార్టీలు తనను ఆహ్వానించాయని, తాను ఏ పార్టీలోనూ చేరనని జనసేనలోనే కొనసాగుతానని రెడ్డి అప్పలనాయుడు స్పష్టం చేశారు. పవరుపేటలోని జనసేన కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ-జనసేన పొత్తులో ఏలూరు స్థానాన్ని టీడీపీకి కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ అభ్యర్థి బడేటి చంటి విజయానికి సహకరించాలని తనను కోరారని, తాను మాట ఇవ్వలేదన్నారు. పార్టీ అధిష్టానంతో మాట్లాడిన తర్వాత టీడీపీతో కలసి ప్రచారాల్లో పాల్గొందామని కార్యకర్తలకు చెప్పారు. అప్పటివరకు ప్రచారానికి వెళ్లవద్దని, ఏ పార్టీ, ఎవరిపై విమర్శలు చేయకుండా క్రమశిక్షణతో ఉండాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు సిరిపల్లి ప్రసాద్, ఒబిలిశెట్టి శ్రావణకుమార్‌గుప్త, దోనేపూడి లోవరాజు, నగిరెడ్డి కాశీ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను గద్దె దించాలి

కొయ్యలగూడెం, మార్చి 3: బీజేపీ, వైసీపీ ప్రభు త్వాలను గద్దె దించాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు అ న్నారు. కనకాద్రిపురంలో ఆదివారం మహిళా నాయ కులతో సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుట్టాయిగూడెం మండలంలో జరిగే జిల్లా జనరల్‌బాడీ సమావేశానికి పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ ముఖ్య అతిథిగా వస్తున్నారని, ఆయనతోపాటు జాతీయ కార్యవర్గ నాయ కులు కూడా హాజరవుతున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అన్ని గ్రామాల నుంచి పెద్దఎత్తున సభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, నాగమణి, సైదా, చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పవిత్ర మాసం

చింతలపూడి, మార్చి 3 : ఈనెలలో రంజాన్ ప్రారంభం కానుండడంతో పవిత్ర మాసమని భీమవరం జమాతే ఇస్లామి హింద్ సభ్యుడు ఎండీ.సిద్ధిక్ అన్నారు. ఆదివారం స్థానిక జామియా మసీదులో రంజాన్‌ను స్వాగతిస్తూ పట్టణ జమాతే ఇస్లామి హింద్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యావత్ మానవాళికి వరాలు కురిపించే మాసం రంజాన్ అని, పవిత్ర ఖురాన్ అవతరింపబడిన రోజు అన్నారు. ప్రసంగీకులు అబ్దుల్ నదీం, ఎం.డి.అక్బర్ ఆలీ, ఎస్.కె.హుస్సేన్, మసీదు కమిటీ నాయకులు సయ్యద్ రహీం, జిలాని, ఎ.రజాక్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

దివంగత నేత బాలయోగికి నివాళి

ఉంగుటూరు, మార్చి 3: లోక్‌సభకు తొలి దళిత స్పీకర్‌గా పనిచేసిన గంటి మోహన చంద్ర బాలయోగి పేదలకు చేసిన సేవలు మరువలేనివని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అఅన్నారు. బాలయోగి వర్ధంతి సందర్భంగా కైకరం ఎన్టీఆర్ చౌక్‌లో బాలయోగి విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి సలగాల గోపి, మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్, కరణం పెద్దిరాజు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం..

- **చింతలపూడి :** చింతలపూడి శివారు మాదాపుకుంట చెరువు ఎగువన హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళాలు ఇచ్చిన దాతలను ఆదివారం ఘనంగా సన్మానించారు. మానవత గౌరవ అధ్యక్షులు ఎ.అప్పారావు మాట్లాడుతూ ఈ శ్మశాన వాటికకు 40 మంది దాతలు సహకరించారన్నారు. శ్మశాన వాటికను ప్రారంభించారు. ఎ.సత్యనారాయణ, కె.నాగ చిన్నారావు, పి.సోమశేఖరాచార్యులు, ఎ.రాజారావు, జె.విశ్వేశ్వరరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** శివాలయానికి కంచర్ల పవన్‌కుమార్ టీవీ బహూకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు తెలిపారు. ఆలయంలో రద్దీ సమయంలో భక్తులు పూజా కార్యక్రమాలు బయట నుండి తిలకించేందుకు టీవీ ఉపయోగపడుతుందన్నారు.
- **బుట్టాయగూడెం :** తపన ఫౌండేషన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి మండలంలోని మెట్టగూడెంకు చెందిన ఆకుల శ్రావణి ఇంజనీరింగ్ ఫీజు నిమిత్తం రూ.20 వేలు అందించారు. ఫౌండేషన్ ద్వారా అనేక మంది విద్యార్థులకు సహాయం చేస్తున్నామన్నారు.
- కొయ్యలగూడెం మండలం బోడిగూడెంకు చెందిన చిడిపి సీతయ్యకు దుద్దుకూరులో తెల్లం రాజ్యలక్ష్మి ఆర్థికసాయం అందజేశారు. వైద్యాధికారితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.
- **భీమడోలు :** పెద్ద మార్కెట్ సమీపంలో నిర్మించిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భవనాన్ని ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు ప్రారంభించారు. స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను పుప్పాల వాసుబాబు కొనియాడారు. భీమడోలు సర్పంచ్ పాము సునీత, పోలసానపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగమ్, కార్యక్రమంలో మానవతా సంస్థ ప్రతినిధులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

భూ పంపిణీ ఎన్నికల మాయాజాలం

- గతంలో చెల్లని ఆధారాలు ఇప్పుడు ఎలా చెల్లాయి
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో నిబంధనలు బేఖాతరు
- ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు బాబ్జి


బాబ్జి

మొగల్తూరు,మార్చి 3: వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కాళీపట్నం భూ పంపిణీ కార్యక్రమం ఎన్నికల మాయాజాలమని ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు మేడిద మాధవ కృష్ణారావు (బాబ్జి) ఆరోపించారు. ఆదివారం మొగల్తూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళీపట్నం రెవెన్యూ పరిధిలో గల భూమి అంతా జమిందార్‌గా చెప్పుకున్న కాంద్రేకుల సదాశివరామకృష్ణారావుకు సంబంధం లేదంటూ నరసాపురం కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ తీర్పులు వచ్చాయన్నారు. దీంతో ఈ కేసును 1969లో విజయవాడ ట్రిబ్యునల్‌కు సుప్రీం కోర్టు పంపిందన్నారు. ఈ భూములపై అప్పటి ప్రభుత్వం వేసిన నాన్ అఫిషియల్ కమిటీ విచారణ చేసి ప్రభుత్వ భూమిగా ధృవీకరించిందన్నారు. విజయవాడ ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాలతో 1978 నుండి 82 వరకూ విచారణ చేసి భూమిపై సాగు రైతులకు హక్కులు లేవని సెటిల్‌మెంట్ కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. 1973లో ఇవి ప్రభుత్వ భూములని సెటిల్‌మెంట్ అధికారులు గ్రామంలో టాంటాం వేయించారన్నారు. 1947కు భూమిపై రైతుల హక్కు పత్రాలు 1978 నుండి 82 వరకూ సెటిల్‌మెంట్ కమిషనర్, నరసాపురం సబ్ కలెక్టర్‌లు చేసిన విచారణలో రైతుల హక్కులు చెల్లవని తీర్పు ఇచ్చారన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 7 ప్రకారం 1947కు భూమిపై సాగు చేసుకునే వారికి గల హక్కులు విచారించి పట్టాలు ఇవ్వాల్సి ఉందని తెలియ జేశారు. నాటి విచారణలో లేని ఆధారాలు ఇప్పుడెలా చెల్లుబాటు అయ్యాయని ఆయన ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో ఓట్లు కోసమే అధికార పార్టీ కాళీపట్నం భూ సమస్య పరిష్కారం చేసినట్టు ఆధారాలు సక్రమంగా లేకన్నా పది మంది కి పట్టాలిచ్చారన్నారు. అధికారులు సయితం అధికార పార్టీ వత్తిడికి లోనయి నిబంధనలు తుంగలో తొక్కి వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము చట్టపరంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పోరాడతామన్నారు. ఎన్నికల కోసం అధికార పార్టీ కాళీపట్నం ప్రజలను మభ్యపెడితే సహించేది లేదన్నారు.

పట్టిసీమ ముస్తాబు

మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అధికారులు ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, ఆలయ అధికారులు చెబుతున్నారు.


పట్టిసీమలో గోదావరిపై పంట్లతో నిర్మిస్తున్న వంతెన

పోలవరం, మార్చి 3 : పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 7 నుంచి పారంభం కానున్న నేపథ్యంలో ఉత్సవ ఏర్పాట్లను ఆలయ అధికారులు, ఫెర్రీ కాంట్రాక్టర్లు వేగవంతం చేశారు. గోదావరి నదిపై భక్తుల రాకపోకలకు అవతలి వైపున కర్రలు, వెదురు తడికలతో కాలిబాట ఏర్పాటు చేశారు. స్నానాల రేవులకు బారికేడ్‌లు, బట్టలు మార్చుకునే గదులు, ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. కన్నాపురం అడ్డ రోడ్డు నుంచి రహదారి మరమ్మతులు నేషనల్ హైవే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తూతూ మంత్రంగా జరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారి మార్జిన్లకు బెర్మ్‌లు లేవని, అధికారులు గత సమీక్షలో మూడో తేదీకి పూర్తి చేస్తామని చెప్పిన తీరులో క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు. దీంతో ఈ రహదారిలో పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలలో వాహనాలు తప్పుకోవడాని కి మార్గం లేక ఇబ్బందులు తప్పవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యువ మోర్చ ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా అరసవల్లి మణికంఠ



భీమవరంటౌన్, మార్చి 3 : భారతీయ జనతా పార్టీ విభాగం యువ మోర్చ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా భీమవరానికి చెందిన అరసవల్లి మణికంఠ వెంకటేష్‌ని నియమించారు. ఈయన గతంలో పట్టణ యువ మోర్చా అధ్యక్షుడిగా, జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. దీంతో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ నూతన కమిటీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. మణికంఠ ఎన్నికపై జిల్లా యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అరసవల్లి మణికంఠ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మధుకర్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కన్వీనర్ పాక వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పూర్వ బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఆకుల లీల కృష్ణమూర్తి, భారతీయ జన తా జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

అంబేడ్కర్ విగ్రహం తరలింపు.. మరోచోట ప్రతిష్ట



మండవల్లి, మార్చి 3: మండవల్లి ప్రధాన సెంటర్‌లో 33 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మరో చోటకు ఆదివారం మార్చారు. 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహాన్ని అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్దకు మార్చారు. తీన్‌మార్ డప్పుల వాయిద్యాలతో జైభీమ్ నినాదాల మధ్య విగ్రహాన్ని క్రేన్ మార్చారు. అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు, సీహెచ్ విజయ్, గౌరవ అధ్యక్షుడు ఎల్.ఎస్. భాస్కరరావు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

నూజివీడు టౌన్, మార్చి 3: నూజివీడు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. నూజివీడు గురుకుల పాఠశాల సమీపంలోని క్రీడా ప్రాంగణంలో నిర్మించతలపెట్టిన క్రికెట్ స్టేడియంకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చాట్రాయి: తుమ్మగూడెం నుంచి ముసునూరు మండలం సూరేపల్లి వరకు నిర్మించనున్న బీటీ రహదారికి ఆదివారం నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: గోగులంపాడు రామాలయం నుంచి ముక్కొల్లుపాడు వెళ్ళే జడ్పీ రహదారి అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్ శంకుస్థాపన చేశారు. సుమారు ఐదుకిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ అంతర్గత రహదారిని నాబార్డు నిధులు రూ.4కోట్ల10లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీపీ దుర్గాభవానీ, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సూరవరంలో నిర్మించిన 33/11కె సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు.

వైవాకలో అభివృద్ధి పనులు ప్రారంభం

ముదినేపల్లి రూరల్, మార్చి 3: మండలంలోని వైవాక గ్రామంలో రూ. 69.50 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమంలో నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం


నాగలక్ష్మి దంపతులు సత్కరిస్తున్న మహిళలు

ముదినేపల్లి, మార్చి 3 : భగవద్గీత పారాయణంలో అత్యు త్తమ ప్రతిభ కన బర్చి ఇటీవల మైసూర్ దత్త పీఠాధిపతి చేతుల మీ దుగా అవార్డు అందుకున్న నరసప్ప చెరువు గ్రామాని కి మానికొండ నాగలక్ష్మిని ఆదివారం శ్రీహరిపురం సాయిబాబా మంది రంలో ఘనంగా సత్కరించారు. మచిలీపట్నంకు చెందిన రత్న మాణిక్యం, ఏలూరుకు చెందిన సింగులూరి జయశ్రీ, శ్రీహరిపురానికి చెందిన నీలం సుమతితో పాటు ఆమె వద్ద ఆన్‌లైన్‌లో భగవద్గీత పారాయణం నేర్చుకున్న మహిళలు నాగలక్ష్మి దంపతులను సత్కరించారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

నూజివీడు టౌన్, మార్చి 3: గంజాయి అక్రమ నిల్వ, అమ్మకాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. ముసునూరు మండలం చిల్లబోయినపల్లి శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళుతున్న నూజివీడు పట్టణానికి చెందిన చింతం విజయ్‌బాబు, షేక్ మొహిద్దీన్, షేక్ మెహరాలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీన పర్చుకోవడం జరిగిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

వన్యప్రాణులను రక్షించండి

మండవల్లి, మార్చి 3: అంతరించిపోతున్న వన్యప్రాణులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్. భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి. అప్పారావు అన్నారు. వన్యప్రాణుల ఆవశ్యకతపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. అడవులను రక్షించండి - వన్యప్రాణులను కాపాడండి, కొల్లేరు చిత్తడి నేలలను రక్షించండి - వన్యప్రాణులను కాపాడండి, ప్రకృతిని రక్షించండి - పర్యావరణాన్ని కాపాడండి.. అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాతో పాటు పారిశ్రామికీకరణ వల్ల సహజ వనరులకు అవరోధం ఏర్పడుతోందన్నారు. ఐక్యవేదిక క్రియాశీలక సభ్యులు కె. మార్కరాజు, బండిరంగారావు, గుడివాడ విజయ రమేష్‌కుమార్, పొన్నూరి రామచంద్రరావు, గంజాల శ్రీనివాసరావు, కె. అదృష్టరావు తదితరులు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

WANTED
★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్లను / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14162

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయింలతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకుల బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్‌కు, ఇతర పుకార్ల మోసాలకు ప్రకటనదారుతో జరుపుటకు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిపిటి

ఆదివాసీ చట్టాలపై పోరాటం

సంక్షేమ పరిషత్ జాతీయ ముఖ్య సలహాదారు



సమావేశంలో మాట్లాడుతున్న కోర్సా వెంకటేశ్వర్లు

బుట్టాయగూడెం, మార్చి 3: భారత రాజ్యాంగంలో ఆదివాసీ చట్టాల అమలుకు పోరాటాలు తప్పవని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ముఖ్య సలహాదారు కోర్సా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కోయ అంకంపాలెంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్ తెలుగు రాష్ట్రాల కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు అధ్వర్యంలో జరిగింది. 5వ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులు 1/59, అమెండ్‌మెంట్ 1/70 చట్టాలు అమలులోకి వచ్చిన తర్వాత అక్రమంగా చొరబడిఏజెన్సీ వనరులను దోచుకుంటున్నారని తెలిపారు. అధికారులు అక్రమ ఎన్‌వోసిలు జారీ చేయడంతో ఆదివాసీ పథకాలను భూస్వాములు దోచుకుంటున్నారని తెలిపారు. ఏజెన్సీలో గిరిజనేతరుల గుర్తింపు కార్డులను రద్దు చేయాలన్నారు. గిరిజనేతరుల చొరబాటుతో జివో నెంబరు 3 రద్దు అయ్యిందని, దీనిపై ఆదివాసీ ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధకరమన్నారు. యువత మేలుకొని ఆదివాసీల చట్టాల అమలుకు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కుంజా శ్రీను, వాబయోగి, వంతల నాగేశ్వరావు, కల్లూరి జయబాబు, తెల్లం రాములు, కణితి శేఖర్, పివి మురళి మనోహర్, యడ్ల సూర్యానారాయణ, సోయం కామరాజు, అప్పన్న, కుంజా కృష్ణంరాజు, తీగల బాబురావు, సరియం నాగేశ్వరావు, కూరం సంజీవరావు, తెల్లం లక్ష్మణ్ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

చిన వెంకన్న క్షేత్రంలో భక్తుల కోలాహలం



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ద్వారకాతిరుమల, మార్చి3: ద్వారకా తిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సాధారణ సెలవురోజు కావడంతో పాటు ఈ మాఘమాసంలో శనివారం రాత్రి అధికంగా వివాహాలు జరిగాయి. ఆదివారం పెళ్లి బృందాలు శ్రీవారిని దర్శించుకున్నాయి. దీంతో ఆలయం యాత్రికులతో నిండిపోయింది. ఆలయానికి 15 వేల మంది పైబడి యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

యూటీఎఫ్ ఉద్యమ కార్యాచరణ ఖరారు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 3 : పాత పెన్షన్ పునరుద్ధరించాలని యూటీఎఫ్ చేపట్టిన పోరాటంలో భాగంగా మలివిడత ఉద్యమాన్ని ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ప్రకటించారు. ఆదివారం కార్యవర్గ సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 10 వరకు అన్ని పాఠశాలల్లో బుక్‌లెట్ స్టిక్కర్స్‌తో ఓట్‌ఫర్ ఓపీఎస్‌పై ప్రచారం, డివిజన్, జిల్లా కేంద్రాలలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, 15 నుంచి 30 వరకు అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులతో చర్చావేదికలు, 26 నుంచి 30 వరకు అన్ని నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు ఉంటాయన్నారు. 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, కేజీబీవీ టీచర్లు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయినులు, సమగ్రశిక్ష ఉద్యోగులను ఒకే వేదిక పైకి చేరుస్తామన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫాఅలీ, నాయకులు శ్యాంబాబు, కనకదుర్గ, రంగమోహన్, రాంబాబు, సుధారాణి, శివశంకర్, శ్రీనివాసరావు, సాగర్, పీవీ నరసింహారావు పాల్గొన్నారు.

కళా పరిషత్ జాతీయ నాటిక పోటీలు ప్రారంభం

పాలకొల్లు, మార్చి, 3: పాలకొల్లు కళాపరిషత్ 15వ జాతీయ నాటిక పోటీలు ఆదివారం శ్రీఅద్దేపల్లి గంగరాజు సత్రం ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు మూడు రోజులు జరగనున్నాయి. మొదటిగా చైతన్య కళాభారతి కరీంనగర్ కళాకారులతో స్వప్నం రాల్చిన అమృతం నాటిక ప్రదర్శించారు. టీడీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, పాకా సత్యనారాయణ, గుడాల గోపీ, డీటీడీసీ బాబు కళాపరిషత్ అధ్యక్షుడు కెవి.కృష్ణవర్మ, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు చౌదరి, ఉపాధ్యక్షుడు డాక్టర్ వర్మ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని విద్యార్థి మృతి


రోదిస్తున్నమామ్మ, బాలుడు(ఫైల్)

ఆకివీడు, మార్చి 3: లారీ ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. గంగానమ్మకోడ్‌లో తాపీమేస్త్రీ కొట్టాడ మనోహర్ నివశిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు కొట్టాడ వాసుదేవ శ్రీశ్రీహర్ష (9) ప్రైవేటు పాఠశాలలో నాల్గోవ తరగతి చదువుతున్నాడు. సైకిల్‌పై వెలంపేట రామాలయం వీధిలోకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మనోహర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుని బంధువులు, స్థానికులు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

పెదవేగి, మార్చి 3 : చేసిన అప్పులు కళ్ల ముందు కదలాడుతుంటే, వాటిని తీర్చే మార్గం కనిపించక ప్రాణాలనే తీసుకున్న విషాద ఘటన కవ్వగుంటలో జరిగింది. పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాలివి.. అద్దులూరి నాగరాజు కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యాపారం నిమిత్తం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురై శనివారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. చికిత్స పొందుతూ నాగరాజు (56) ఆదివారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పితో మరొకరు..


నాగరాజు మృతదేహం

ఏలూరు క్రైం, మార్చి 3 : కడుపునొప్పి భరించలేక రైతు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన అర్జునూరి నాగరాజు (54)కు భార్య రాణి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న నాగరాజు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆదివారం పురుగుమందు తాగాడు. అస్వస్థతకు గురైన అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం


గిరమ్మ చెరువులో మృతదేహం

కామవరపుకోట, మార్చి 3 : రావికంపాడులోని గిరమ్మ చెరువు వద్ద ముళ్ల పొదల్లో 35-40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని తడికలపూడి పోలీసులు గుర్తించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తడికలపూడి ఎస్‌ఐ జయబాబు తెలిపారు. మృతుడు వారం క్రితమే చనిపోయి ఉండవచ్చునని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహంపై నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, జాకీ కంపెనీకి ఎరుపు రంగు డ్రాయర్ ఉన్నాయి కుడిచేతి మణికట్టు వద్ద ఎరుపు రంగు తాడు ఉంది. వివరాలు తెలిసిన వారు 9440796678కు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


చికిత్స పొందుతున్న సబ్బారపు వెంకటరమణ

పోలవరం, మార్చి 3 : ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటన వివరాలివి.. పట్టిసీమకు చెందిన రైతు సబ్బారపు వెంకటరమణ కన్నాపురం అడ్డరోడ్డు సమీపంలోని పెట్రోలు బంకు పక్కన పంట పొలం నుంచి బైకుపై వస్తుండగా, ప్రగడపల్లి నుంచి ఎదురుగా మరో బైకుపై వస్తున్న గెడ్డం బాలయేసు, గెడ్డం మారేసులు వేగంగా రావడంతో రెండు బైకులు ఢీకొన్నాయి. బాధితులను పోలవరం ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి గెడ్డం జ్యోతి చికిత్స చేసి తీవ్ర గాయాలయిన సబ్బారపు వెంకటరమణను, గెడ్డం బాలయేసును మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గెడ్డం మారేసుకి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలవరం ఎస్‌ఐ పవన్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి ఘటన వివరాలు తెలుసుకున్నారు.

వయ్యేరు కాలువ వద్ద కారు బోల్తా

తణుకు, మార్చి3: దువ్వ వయ్యేరు కాల్వ వద్ద ఆదివారం కారు బోల్తా పడింది. పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన కుటుంబ సభ్యులు ఉంగుటూరు వద్ద వేడుకకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది. ఘటనలో ఎవ్వరికి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మానసిక వికలాంగుడికి గాయాలు


చికిత్స పొందుతున్న బాధితుడు

పోలవరం, మార్చి 3 : రక్షణ వ్యవస్థ లేని ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మతి స్థిమితం లేని వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన కమ్మరగూడెంలో ఆదివారం జరిగింది. వివరాలివి.. కమ్మరగూడెంనకు చెందిన యాదాల సత్యన్నారాయణ మతిస్థిమితం లేక తిరుగుతూ గొంతేలమ్మ ఆలయం వీధిలో అంగన్వాడీకి సమీపంలో రక్షణ వ్యవస్థ లేని ట్రాన్స్‌ఫార్మర్‌ని తాకడంతో మంటలు చెలరేగి గాయాలపాలయ్యాడు. స్థానికులు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. అంగన్వాడీకి సమీపంలో ఉన్న ట్రాన్సాఫార్మర్‌కి ప్యూజు కండక్టర్ల ప్రాంతంలో మెస్ డోర్ లేకపోవడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గతంలో మేకలు చనిపోయాయని, విద్యుత్ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ కోరారు. ఈ విషయంపై ఏఈ కొండా సత్యన్నారాయణను వివరణ కోరగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

30 కాసుల బంగారం, నగదు చోరీ

ఆకివీడు, మార్చి 3: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో సూదాబత్తుల బాలాజీ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. బాలాజీ భార్య, సోదరిణులు ఏలూరు, నిజామాబాద్ నుంచి ద్వారకా తిరుమల పెళ్లికి వెళ్ళేందుకు వచ్చారు. శనివారం బంధువులతో కలిసి ద్వారకా తిరుమల వెళ్లారు. ఆదివారం ఇంటికొచ్చే సరికి మొదటి అంతస్తులో తలుపు తెరిచి ఉండడాన్ని గమనించి, లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపు పగలగొట్టి ఉంది. బీరువాలో 30 కాసుల బంగారం, నగదు దొంగిలించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీమ్ వేలిముద్రలు సేకరించారు. ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో..

ఏలూరు క్రైం, మార్చి 3 : ఇంటికి తాళం వేసి దంపతులు ఉద్యోగ నిర్వహణకు వెళ్లి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న ఈదర శ్రీనివాసరావు దంపతులిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీన ఇంటి తాళాలు పగులగొట్టి పది కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు చోరీ చేశారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవస్థానం కొండగొర్రె మృతి


కొండ గొర్రె కళేబరం

ద్వారకాతిరుమల, మార్చి 3: శ్రీవారి గో సంరక్షణ శాలలో భక్తుల సందర్శనకు ఉంచిన రెండు కొండగొర్రెలలో ఒకటి వైరల్ ఫీవర్‌తో మృతి చెందింది. గతంలో ఈ గొర్రెలు అటవీ ప్రాంతం నుంచి శేషాచల కొండపైకి వచ్చాయి. వీటిని గో సంరక్షణ శాలలో ఉంచారు. ఇవి భక్తులకు ఆహ్లాదాన్ని కలిగించేవి. శనివారం సాయంత్రం ఈ రెండింటికి వైరల్ ఫీవర్ సోకి నీరసించాయి. వెటర్నరీ వైద్యుడు అంగర సురేష్ వైద్య సేవలను అందించారు. ఒకటి మృతి చెందగా మరొకటి కోలుకొంటుందని డాక్టర్ సురేష్ తెలిపారు.

దాడి ఘటనలో రియల్టర్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 3 : మహిళను బెదిరించి అర్ధరాత్రి ఇంటిపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులు, రియల్టర్ జొన్నకూటి మోహనరావు మరి కొంత మందిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు అయింది. ఏలూరు శ్రీరామ్‌నగర్ 11వ రోడ్డులో నివసిస్తున్న పైడికొండల కృష్ణకుమారికు తల్లి 336 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. ఆ స్థలంలో రేకుల షెడ్డు వేసుకుని మూడేళ్ళుగా కృష్ణకుమారి కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఆ స్థలాన్ని పది సంవత్సరాల క్రితం తనకు లీజుకు ఇచ్చారని ఖాళీ చేయాలంటూ శనివారపుపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారీ, వైసీపీ నాయకులు జొన్నకూటి రామ్మోహనరావు మరికొందరు కలిసి గత నెల 29వ తేదీ అర్ధరాత్రి ఇంటిపై దాడికి చేసి, బెదిరించారు. వారి వేధింపులు భరించలేక కృష్ణకుమారి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె ప్రాణాపాయ పరిస్థితిలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధితురాలు కుమార్తె సౌజన్య ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. జొన్నకూటి రామ్మోహనరావు, మరి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడి

పాలకోడేరు, మార్చి 3 : పెన్నాడలో ఆదివారం కోడిపందెలు, పేకాట శిబిరాలపై దాడి చేసి కోతాట ఆడుతున్న నలుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.1920 నగదు, అదే గ్రామంలో కోడిపందెలపై దాడి చేసి మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్ళ, రెండు కత్తులు స్వాధీనం చేసుకుని వారి నుంచి రూ.2వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు.

CUB TRUST AND EXCELLENCE SINCE 1904
సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము: నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322. ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: నం.1) శ్రీ మేక నాగేశ్వరరావు, తండ్రి కృష్ణ, డి.నం.1-70, శ్రీరామవరం పెందులూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534432. నం.2) శ్రీమతి మేక ధర్మరేఖ, భర్త మేక నాగేశ్వరరావు, డి.నం.1-70, శ్రీరామవరం పెందులూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534432. నం.3) మెస్సర్స్ శివపార్వతి ఫీడ్స్ మరియు హెచరీలు, ఎర్రయ్యపేట గ్రామం, తొండంగి మండలం, తుని-533401 నుండి 01.03.2024 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏమైని ఇతర బకాయితో కలిపి 29.02.2024 నాటికి రూ. 1,54,02,034/- (రూపాయలు ఒక కోటి యాభై నాలుగు లక్షల రెండు వేల ముప్పై నాలుగు మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

గమనిక: 11% ROI వంతున రూ.75,00,000/- మొత్తం సదుపాయం కొరకు హామీదారుగా ఉన్నట్టి మీలోని నం.1&2 మరియు సహభాగ్యతాదారుగా ఉన్నట్టి నం.1 & 2 మరియు భాగస్వాములా ఉన్నట్టి మీలోని నం.లు 1 & 2 ద్వారా ప్రాతినిధ్యం వహించు మీలోని నం.3 అభ్యర్థన మేరకు ఆర్థిక సహాయం (SECURED OD WITHOUT DP:51212002031627) తేది 12.05.2021 కూడా మా 135-ఏలూరు శాఖ పొందించిందని గమనించగలరు. వసూలు తేదీ వరకు 29.02.2024 నాటికి మిగులు బకాయి రూ.76,80,290/- ప్లస్ తదుపరి వడ్డీ మరియు 01.03.2024 నుండి చార్జ్ చేయబడు నెలవారీ వాయిదాలతో 2.00% అపరాధ వడ్డీ బకాయిగా ఉంది.

మా బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తులు
షెడ్యూల్-ఎ : (శ్రీ మేక నాగేశ్వరరావు తండ్రి కృష్ణకు చెందిన ఆస్తి)
మద్రాస్ టెర్రస్ భవనం, డి.నం.22బి-8-19 కలిగిన స్థలం, 485-50 చ.గల విస్తీర్ణం అనగా 405-941 చ.మీ.లు దక్షిణం వైపున గల మొత్తంలో 630.00 చ.గల యొక్క విస్తీర్ణం మొత్తంలో 693.00 చ.గల స్థలం గల విస్తీర్ణం, టి.ఎస్.నం.742లో మున్సిపల్ ఇ-వార్డు, పవర్‌పేట, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరు సబ్ రిజిస్ట్రీ, పశ్చిమ గోదావరి జిల్లా, సరిహద్దులు : తూర్పు : మున్సిపల్‌రోడ్-42-2 అ.లు, దక్షిణం : వల్లూరి ఎస్టేట్ యొక్క ఆస్తి-103-3 అ.లు, పశ్చిమం: వల్లూరి ఎస్టేట్ యొక్క ఆస్తి-42-4 అ.లు, ఉత్తరం : మేక ధర్మరేఖ ఆస్తి మరియు గుంటూరు రామకృష్ణ శర్మ కొంత విస్తీర్ణం యొక్క ఆస్తి-103-6 అ.లు, అన్ని సౌకర్యాల హక్కులతో అన్ని ఫిట్టింగ్‌లు మరియు అమరికలు కలుపుకొని అక్కడ ఉన్నగల మద్రాస్ టెర్రస్ భవన నిర్మాణ స్థలం 485.50 చ.గల విస్తీర్ణంగల పై సరిహద్దులతో.
షెడ్యూల్-బి : (శ్రీమతి మేక ధర్మరేఖ భర్త మేక నాగేశ్వరరావుకు చెందిన ఆస్తి)
మద్రాస్ టెర్రస్ భవనం, డి.నం.22బి-8-19 కలిగిన స్థలం, 144-50 చ.గల విస్తీర్ణం అనగా 120-821 చ.మీ.లు ఉత్తరం వైపున గల మొత్తంలో 630.00 చ.గల యొక్క విస్తీర్ణం మొత్తంలో 693.00 చ.గల స్థలం గల విస్తీర్ణం, టి.ఎస్.నం.742లో మున్సిపల్ ఇ-వార్డు, పవర్‌పేట, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరు సబ్ రిజిస్ట్రీ, పశ్చిమ గోదావరి జిల్లా, సరిహద్దులు : తూర్పు : గుంటూరు రామకృష్ణ శర్మ యొక్క ఆస్తి-18-0 అ.లు, దక్షిణం: మేక నాగేశ్వరరావు యొక్క ఆస్తి- 72-0 అ.లు, పశ్చిమం : వల్లూరి ఎస్టేట్ యొక్క ఆస్తి-18-0 అ.లు, ఉత్తరం : మున్సిపల్ రోడ్-72-4 అ.లు, అన్ని సౌకర్యాల హక్కులతో 144-50 చ.గ.లు స్థలం యొక్క విస్తీర్ణం పై సరిహద్దులతో.

రిజర్వు ధర: రూ .2,85,00,000/-
(రూపాయలు రెండు కోట్ల ఎనభై ఐదు లక్షలు మాత్రమే) (షెడ్యూల్ ఎ & బి కొరకు)

ఈ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
22-03-2024	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఏలూరు శాఖ, డి.నం.22 సి-14-11, గ్రౌండ్ ఫ్లోర్, బివిబి మాల్, పుణ్యమూర్తులవారి స్ట్రీట్, పవర్ పేట, ఏలూరు, పశ్చిమ గోదావరి-534002. టెలిఫోన్ నం. 0881-2240340, సెల్ నం.9347078103

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు ఐందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఏలూరు శాఖ, డి.నం.22 సి-14-11, గ్రౌండ్ ఫ్లోర్, బివిబి మాల్, పుణ్యమూర్తులవారి స్ట్రీట్, పవర్ పేట, ఏలూరు, పశ్చిమ గోదావరి-534002 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఐందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్డను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం. 0881-2240340, సెల్ నం.9347078103లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఐందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ వేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఐందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి.11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.
ప్రదేశం : కుంబకోణం, తేది : 02.03.2024 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com



చిన్నారికి చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ



పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్న నూజివీడు ఆర్డీవో







బూరుగ్గూడెంలో దేశిరెడ్డి.. ముసునూరులో ఎంపీపీ దుర్గాభవాని.. ఆగిరిపల్లిలో వైద్యురాలు చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

పోలియో రహిత సమాజమే లక్ష్యం

»పల్స్‌పోలియో కార్యక్రమాల్లో వక్తలు »రెండు నియోజకవర్గాల్లో చిన్నారులకు చుక్కల మందు పంపిణీ

నూజివీడు టౌన్, మార్చి 3: రెండు చుక్కల పోలియో మందు భవిష్యత్ తరాలను పోలియో బారి నుంచి రక్షిస్తుందని, నూజివీడు ఆర్డీవో భవానీశంకరి అన్నారు. నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో ఆమె పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌వో జాస్తి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నూజివీడు డివిజన్‌లోని 15 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 36,254 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు 760 మంది సిబ్బందిని నియమించామని, తొలిరోజు 80 శాతం మంది చిన్నారులకు చుక్కలు వేశామన్నారు. కాగా నూజివీడు పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ ప్రారంభించారు.

చాట్రాయి: మండలంలో 98 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5 ఏళ్లలోపు చిన్నారులు 3527 మంది ఉండగా 3459 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. మిగిలిన చిన్నారులకు 4, 5 తేదీల్లో వైద్య బృందాలు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. బూరుగుగూడెంలో రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, పోలవరంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చెలికాని బాబ్జీ, చాట్రాయిలో సర్పంచ్ దామెర ఉష, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాసుల రెడ్డి, దుర్గాప్రసాద్, సీహెచ్‌వో రమణ పల్స్‌పోలియోను పర్యవేక్షించారు.

ముసునూరు: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవానీ వెంకట్రావు అన్నారు. ఆదివారం ముసునూరు పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే రమణక్కపేట పీహెచ్‌సీలో డాక్టర్ కరీముల్లా, గోపవరంలో తహసీల్దార్ జవహర్ బాజీ, చింతలవల్లిలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవిని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ముసునూరు పీహెచ్‌సీ పరిధిలో 2426 మంది చిన్నారులకు గాను 2439 మంది చిన్నారులకు చుక్కలు వేయగా, రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలో 2226 మంది చిన్నారులకు గాను 2208 మందికి చుక్కలు వేయటం జరిగిందని, 99 శాతం పల్స్‌పోలియో పూర్తి అయినట్లు వైద్యాధికారులు షకీనా ఇవాంజలి, కరీముల్లాలు తెలిపారు. జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలంలో పల్స్‌పోలియో విజయవంతమైందని డాక్టర్ డీనా తెలిపారు. ఆగిరిపల్లి పీహెచ్‌సీ పరిధిలో 93.25 శాతం పూర్తయిందని, 2,310కి గాను 2,154 మందికి పోలియో డ్రాప్స్ వేశామని తెలిపారు. అలాగే సగ్గూరు పీహెచ్‌సీలో 1840 మందికి గాను 1826 మందికి డ్రాప్స్ వేశామని డాక్టర్ మంజులాదేవి తెలిపారు. ఈదర పీహెచ్‌సీలో 1396 మందికి గాను 1375కి పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ నాగజ్యోత్స్న తెలిపారు.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు, మార్చి 3: పోలియో రహిత దేశంగా భారత్‌ను నిలపాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం వద్ద ఆయన ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ రెండు డోసులు పోలియో డ్రాప్స్ అందిస్తే దానిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్, సీతనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం ఆదివారం ముదినేపల్లి మండలంలో విజయవంతమైంది. మండలంలో సుమారు 98 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీల పరిధిలో 0-5 ఏళ్ల మధ్య వయస్సున్న సుమారు 6100 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా, 5989 మంది పిల్లలకు చుక్కలను వేశారు. చుక్కల కేంద్రాలతోపాటు ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్‌లో కూడా చుక్కలు వేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ తదితరులు చుక్కల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శాంతిశ్రీ, శ్వేత, తరణి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, రహీం, హెల్త్ ఎడ్యుకేటర్ జొనాథన్ తదితరులు పర్యవేక్షించారు.

కలిదిండి: పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరమవుతుందని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి సుచిత అన్నారు. ఆదివారం కలిదిండి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు 90 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారన్నారు. మిగిలిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించటానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యాధికారి హేమంత్, ధీరజ్ కుమార్, సూపర్‌వైజర్ నాగమణి, సీహెచ్‌వో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి-1 స్కూల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం కైకలూరు ఏఎంసీ ఛైర్మన్ చేబోయిన వీర్రాజు చిన్నారులకు పోలియోచుక్కలు వేసి ప్రారంభించారు. మండవల్లి సర్పంచ్ మెండ ఝాన్సీ, సురేష్‌బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ బాబి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బి. గోకర్ణ, డాక్టర్ అనిలా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఆదివారం పోలియో చుక్కల పంపిణీ జరిగింది.



కైకలూరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే



ముదినేపల్లిలో చుక్కల మందు పంపిణీలో పాల్గొన్న ఎంపీపీ



కలిదిండిలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి



మండవల్లిలో పోలియో చుక్కలు వేయిస్తున్న ఏఎంసీ చైర్మన్ వీర్రాజు

అంబేడ్కర్ విగ్రహం తరలింపు.. మరోచోట ప్రతిష్ట



మండవల్లి, మార్చి 3: మండవల్లి ప్రధాన సెంటర్‌లో 33 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మరో చోటకు ఆదివారం మార్చారు. 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహాన్ని అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్దకు మార్చారు. తీన్‌మార్ డప్పుల వాయిద్యాలతో జైభీమ్ నినాదాల మధ్య విగ్రహాన్ని క్రేన్ మార్చారు. అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శాంతరాజు, సీహెచ్ విజయ్, గౌరవ అధ్యక్షుడు ఎల్.ఎస్. భాస్కరరావు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు



నూజివీడు టౌన్, మార్చి 3: నూజివీడు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. నూజివీడు గురుకుల పాఠశాల సమీపంలోని క్రీడా ప్రాంగణంలో నిర్మించతలపెట్టిన క్రికెట్ స్టేడియంకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చాట్రాయి: తుమ్మగూడెం నుంచి ముసునూరు మండలం సూరేపల్లి వరకు నిర్మించనున్న బీటీ రహదారికి ఆదివారం నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: గోగులంపాడు రామాలయం నుంచి ముక్కొల్లుపాడు వెళ్ళే జడ్పీ రహదారి అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్ శంకుస్థాపన చేశారు. సుమారు ఐదుకిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ అంతర్గత రహదారిని నాబార్డు నిధులు రూ.4కోట్ల10లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీపీ దుర్గాభవానీ, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సూరవరంలో నిర్మించిన 33/11కె సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాక గ్రామంలో రూ. 69.50 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో మిగిలిన అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమంలో నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



ముదినేపల్లి, మార్చి 3 : భగవద్గీత పారాయణంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఇటీవల మైసూర్ దత్త పీఠాధిపతి చేతులమీదుగా అవార్డు అందుకున్న నరసప్ప చెరువు గ్రామానికి మానికొండ నాగలక్ష్మిని ఆదివారం శ్రీహరిపురం సాయిబాబా మందిరంలో ఘనంగా సత్కరించారు. మచిలీపట్నంకు చెందిన రత్నమాణిక్యం, ఏలూరుకు చెందిన సింగులూరి జయశ్రీ, శ్రీహరిపురానికి చెందిన నీలం సుమతితోపాటు ఆమె వద్ద ఆన్‌లైన్‌లో భగవద్గీత పారాయణం నేర్చుకున్న మహిళలు నాగలక్ష్మి దంపతులను సత్కరించారు.

మద్దిరావమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ



ఆగిరిపల్లి, మార్చి 3: ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల గ్రామంలో ఆదివారం అంకమ్మ, మద్దిరావమ్మ, పోతురాజు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం మేళ తాళాలతో కన్నులపండువగా జరిగింది. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రేతలకు రిమాండ్

నూజివీడు టౌన్, మార్చి 3: గంజాయి అక్రమ నిల్వ, అమ్మకాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. ముసునూరు మండలం చిల్లబోయినపల్లి శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళుతున్న నూజివీడు పట్టణానికి చెందిన చింతం విజయ్‌బాబు, షేక్ మొహిద్దీన్, షేక్ మెహరూలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీన పర్చుకోవడం జరిగిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి

ముసునూరు, మార్చి 3: రమణక్కపేటలో ఆదివారం కోడిపందేల శిబిరంపై ఎస్సై పి.వాసు దాడి చేశారు. ఏడుగురు పందెం రాయుళ్ళను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి రూ.1400 నగదును, ఏడు బైక్‌లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని ఎస్సై హెచ్చరించారు.



నూజివీడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి



కొత్తగూడెంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో కొలుసు, మాగంటి

భిన్నమైన ఎన్నికలు చూడబోతున్నాం..

»గ్రూపులకు తావివ్వద్దు.. సమష్టిగా శ్రమిద్దాం
»నూజివీడు నియోజకవర్గ టీడీపీ సమావేశంలో పార్థసారథి
»కొత్తగూడెంలో మాగంటితో కలసి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నూజివీడు, మార్చి 3: ఎన్నికల్లో అధికార పార్టీ అభివృద్ధిని చూపుతూ పోటీకి రావడం లేదని, దోచిన డబ్బుతో పోటీకి వస్తోందని, గత ఎన్నికల కన్నా భిన్నమైన ఎన్నికలను చూడబోతున్నామని ఎమ్మెల్యే, నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం నూజివీడులో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సంక్షేమం నేతిబీరలో నేతి చందంగా ఉందన్నారు. 3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామని చెబుతున్న ప్రభుత్వం ఆ నిధితో రైతులకు ఏం మేలుచేసిందో చెప్పగలదా అని ప్రశ్నించారు. నాసిరకపు లిక్కర్ విక్రయాల వల్ల వేలాదిమంది ప్రజలు చనిపోతున్నా ప్రభుత్వం తనకున్న ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. నియోజకవర్గంలో ఇక నుంచి గ్రూప్‌లకు తావులేదని అందరం ఒకే కుటుంబంలా సమష్టిగా శ్రమించి ఇక్కడ తెలుగుదేశం పార్టీని గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు చెప్పిన విధంగా నడుస్తానన్నారు.

టిడ్కో ఇళ్లు ఆరు నెలల్లో ఇవ్వకుంటే నా ఇంటిపై రాళ్లేయండి..

నూజివీడులో 80 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్ళను తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు పూర్తిచేసి ప్రజలకు అందిస్తానని, అలా జరగకపోతే లబ్ధిదారులు తన ఇంటిపై రాళ్ళు రువ్వవచ్చని సారథి స్పష్టం చేశారు. స్థానికుడిని అని చెప్పుకుంటే సరిపోదని, పెనమలూరులోనూ తాను స్థానికుడిని కానని, అయినా అక్కడ ప్రజలు తన పనితీరును చూసి మూడుసార్లు తనను గెలిపించారన్నారు. ఇక్కడ శాసనసభ్యుడు రైతులకు ఆధారమైన చింతలపూడి విషయంలోనూ, టిడ్కో గృహాల విషయంలోనూ కనీసం మాట్లాడలేదని, తాను అధికారంలోకి వచ్చిన తరువాత చింతలపూడిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు టిడ్కో ఇళ్ళను ఆరునెలల్లో పూర్తిచేయడంతో పాటు నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ సమస్యలపై దృష్టిసారించి వాటి పరిష్కారంపై దృష్టిపెడతానన్నారు. 2018లో నిధులు మంజూరైన వివిధ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని దీనిపై ఎందుకు నిలిచాయో ఎంక్వైరీ చేస్తే కాంట్రాక్టర్ల నుంచి 20 శాతం కమీషన్లు అడుగుతున్నారని విషయం బయటపడిందన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే కుమారుడిపై అనేక ఆరోపణలు విన్నానని, వాటిని తాను అరికడతానన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, నూజివీడు పట్టణ నాయకులు హాజరు అయ్యారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర మనుగడ..

చాట్రాయి: టీడీపీ, జనసేన కూటమిని గెలిపించుకొని చంద్రబాబును సీఎంను చేస్తేనే రాష్ట్రానికి మనుగడ ఉంటుందని ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, నూజివీడు టీడీపీ అభ్యర్థి పార్థసారథి అన్నారు. కొత్తగూడెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి వారు ఆవిష్కరించి మాట్లాడుతూ ఐదేళ్లుగా జగన్ విధ్వంసక, అరాచక పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, వైసీపీ బూటకపు వాగ్దానాలకు మళ్ళీ మోసపోతే భావితరాలకు మనుగడ ఉండదన్నారు. రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పు తీసుకొని ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీ అడ్డదారుల్లో మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రయత్నాలు చేస్తున్నదని టీడీపీ, జనసేన శ్రేణులు వైసీపీ కుట్రలు తిప్పికొట్టాలన్నారు. అంతకు ముందు సోమవరం గ్రామం వద్ద మాగంటి, పార్థసారథికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడే దివంగత టీడీపీ నాయకులు యర్రోజు సత్యనారాయణ విగ్రహానికి నేతలు నివాళులర్పించారు. అనంతరం సోమవరం నుంచి కొత్తగూడెం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు గంగాధర్, అట్లూరి రమేష్, నూతక్కి వేణు, మండల నాయకులు బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, వెల్ది నాగేశ్వరరావు, రాజారత్నం, శేఖర్, దుర్గారావు, వెల్ది రాజారావు అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కాకరవాడలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కామినేని..



కైకలూరులో బాలయోగి విగ్రహానికి నివాళి..

విలక్షణ తీర్పివ్వండి : కామినేని

ముదినేపల్లి, మార్చి 3: రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే రానున్న ఎన్నికల్లో ప్రజలు విచక్షణతో వ్యవహరించి విలక్షణమైన తీర్పు ఇచ్చి సుపరిపాలనను తీసుకురావాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన ముదినేపల్లి మండలం కాకరవాడ, శ్రీహరిపురం గ్రామాల్లో గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు పేరుతో ప్రభుత్వం ఆస్తులను సైతం తాకట్టు పెట్టి అప్పులు తీసుకురావటం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి బ్యాంకుల నుంచి అప్పు తీసుకోవటం ఆర్థిక పరిస్థితిని ఎంతగా దిగజార్చిందో అర్థమవుతుందని విమర్శించారు. ప్రజలకు మేలు చేసే పరిపాలనా దక్షుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని, వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని కామినేని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, టీడీపీ నాయకులు కొత్తూరు విఠల్, లింగమనేని భాను ప్రసాద్, కోడూరు శేషుబాబు, పరసా విశ్వేశ్వరరావు, బీజేపీ నాయకులు పైడిపాటి శివశంకర్, బాసినశెట్టి కిషోర్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీహరిపురంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు కామినేనికి ఆత్మీయ స్వాగతం పలికారు.

యువతకు ఆదర్శం బాలయోగి..

కైకలూరు: లోక్‌సభ స్పీకర్‌గా జీఎంసీ బాలయోగి అందించిన సేవలు నేటి యువతకు ఆదర్శనీయమని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బాలయోగి వర్ధంతి సందర్భంగా కైకలూరు తాలుకా సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ జాతీయ నాయకుడిగా టీడీపీలో పనిచేస్తూ అనేక సంస్కరణలను తీసుకువచ్చారని, అలాంటి నాయకుడ్ని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. టీడీపీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. మాజీ ఎంపీపీ నరసింహారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు విజయలక్ష్మి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బాబు, మహిళా నాయకురాలు లక్ష్మీరాణి, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, టీడీపీ నేతలు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, గంగుల ఏసురాజు, ఎస్సీ సెల్ నాయకులు తేరా రమేష్ బాబు, వీరాబత్తిన సుధా, పళ్లెం వెంకటేశ్వరరావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను రక్షించండి

మండవల్లి, మార్చి 3: అంతరించిపోతున్న వన్యప్రాణులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్. భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి. అప్పారావు అన్నారు. వన్యప్రాణుల ఆవశ్యకతపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడవులను రక్షించండి - వన్యప్రాణులను కాపాడండి, కొల్లేరు చిత్తడి నేలలను రక్షించండి - వన్యప్రాణులను కాపాడండి, ప్రకృతిని రక్షించండి - పర్యావరణాన్ని కాపాడండి.. అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాతో పాటు పారిశ్రామికీకరణ వల్ల సహజ వనరులకు అవరోధం ఏర్పడుతోందన్నారు. ఐక్యవేదిక క్రియాశీలక సభ్యులు కె. మార్కరాజు, బండిరంగారావు, గుడివాడ విజయ రమేష్‌కుమార్, పొన్నూరి రామచంద్రరావు, గంజాల శ్రీనివాసరావు, కె. అదృష్టరావు తదితరులు పాల్గొన్నారు.



మండవల్లిలో వన్యప్రాణుల ఆవశ్యకతపై ర్యాలీ

సచివాలయం తాకట్టు దారుణం : మంగినేని

ముదినేపల్లి, మార్చి 3 : అప్పు కోసం వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర సచివాలయాన్నే బ్యాంకులకు తాకట్టు పెట్టడం దారుణమని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు మంగినేని బాబ్జీ విమర్శించారు. సంక్షేమ పథకాల అమలుకు ఆదాయం సృష్టించుకోవాలి తప్ప ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం సరికాదని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పులు తీసుకోవటంలో మితిమీరి వ్యవహరించటం మంచిది కాదని పేర్కొన్నారు.

ఆగిరిపల్లి బస్టాండ్‌లో పర్యవేక్షకుడిని నియమిస్తా

»ఏలూరు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వరప్రసాద్

ఆగిరిపల్లి, మార్చి 3: ఆగిరిపల్లి బస్టాండ్‌ను ఏలూరు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వరప్రసాద్, నూజివీడు డిపో మేనేజరు పవన్‌కుమార్ సందర్శించారు. బస్టాండ్, ఆటోస్టాండ్‌ను తలపిస్తోందని, ఆటోలన్నీ అక్కడే ఉంటున్నాయని, రాత్రిపూట బస్టాండ్‌లో ఒక్క లైట్ కూడా వెలగటం లేదని, రాత్రిపూట తాగుబోతులకు, సంఘ విద్రోహులకు అడ్డాగా మారిందని ప్రజలు మొరపెట్టుకోగా ఆయన విచారణకు వచ్చారు. ఇక్కడ ఒక పర్యవేక్షకుడిని నియమిస్తామని ఆగిరిపల్లిలో నాన్‌స్టాప్‌లు కూడా ఆపుతామని ఆగిరిపల్లి నుంచి హైదరాబాద్‌కు తిరువూరు, ఖమ్మం మీదుగా సూపర్ లగ్జరీ బస్సు నడుపుతామని వచ్చే వేసవిలో మామిడిపండ్ల సీజన్‌కు నూజివీడు నుంచి హైదరాబాద్‌కు మామిడి రవాణాకు కార్గో బస్సు ద్వారా సేవలు అందిస్తామని బస్సుల ఆక్యుపెన్సీ పెంచి తద్వారా డిపోకు ఆదాయం పెంచుతామని తెలిపారు.

రేపు 'జయహో బీసీ' విజయవంతం చేయాలి

కలిదిండి, మార్చి 3 : మంగళగిరిలో టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5న నిర్వహించే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మట్టగుంటలో విలేకరులతో మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం బీసీ డిక్లరేషన్‌ను అధినేత చంద్రబాబు జయహో బీసీ సభలో ప్రకటిస్తారని బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముగిసిన మేరీ మాత ఉత్సవాలు




కలిదిండి, మార్చి 3 : కలిదిండిలో మూడు రోజులుగా జరుగుతున్న మేరీ మాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. చర్చి ఆవరణలోని కల్వరి కొండ వద్ద గల మేరీమాత, ఏసుక్రీస్తు శిలువ వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి అరటి గెలలు సమర్పించారు. పీఠాధిపతులను సత్కరించారు. ఏసు కృప బైబిల్ నాటకం ప్రదర్శించారు. డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో కైకలూరు సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ ప్రియకుమార్ బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలకు సహకరించిన వారందరికీ విచారణకర్త బంటుమిల్లి యోహాను కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీపీ ఉమామహేశ్వరరావు, కలిదిండి సర్పంచ్ మారుతి ప్రసన్న మేరీమాతను దర్శించుకున్నారు.



ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

చాట్రాయి, మార్చి 3: మండలంలోని పోలవరం కోనేరు రంగారావు కాలనీ ప్రాథమిక పాఠశాల 19వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఏకపాత్రాభినయం, నాటికలు, దేశభక్తి గేయాలు, అంతరించిపోతున్న వివిధ కళారూపాలు అందరిని అలరించాయి. వక్తలు మాట్లాడుతూ విద్య నేర్పడమే కాక, జీవన విలువలు, జీవన నైపుణ్యాలు పెంపొందించటం ఈ పాఠశాల ప్రత్యేకతని కొనియాడారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చెలికాని బాబ్జీ, ఎంఈవో బ్రహ్మచారి, హెచ్ఎం నాగేశ్వరరావు, గ్రామ ప్రముఖుడు చాగంటి నరసింహారావు, దాతలు వజ్రపు కృష్ణమూర్తి, ధారావత్తు మంగయ్య, తుంగా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శాఖాహార ర్యాలీ

ఆగిరిపల్లి, మార్చి 3: గరికపాటి పిరమిడ్ ధ్యానమందిరం ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో శాఖాహార ర్యాలీ, మెడిటేషన్ తరగతులు నిర్వహించారు. గరికపాటి సుబ్రహ్మణ్యం, భూపతిరాజు, నాగరాజు, అమిరిశెట్టి మౌనిక తదితరులు పాల్గొన్నారు.